## అధ్యాయము 27

# ఏశావు ఆశీర్వాదాన్ని యాకోబు దొంగిలించుట

బలీయమైన కోరికకు లేదా సంకల్పానికి సంబంధించిన క్లిష్టపరిస్థితి విషయంలో, ఇస్సాకు గురించి అతని కుటుంబ సభ్యుల గురించి వర్ణన 27వ అధ్యాయములోను కొనసాగుతుంది. ఇస్సాకు రిబ్కాలకు పుట్టిన ఇద్దరు కుమారులు భిన్నమైన స్వభావాలతో విభిన్నమైన జీవనశైలులతో ఉన్నారు. ఇంకా, తండ్రి ఒకరిపట్ల తల్లి మరొకరిపట్ల పక్షపాతం చూపించారు; ఇందులో కూడా తమ స్వభావానికి భిన్నమైన స్వభావంగలవారి పట్ల పక్షపాతం చూపడం గమనార్హం. ఎవరినీ ఎదిరించకుండా ఉదాసీన వైఖరితో తన మనసుకు నచ్చినట్టుగా జీవించే ఇస్సాకు, ఆరుబయలు ప్రదేశాల్లో సంచరించడానికి ఇష్టపడే మొరటు ఏశావుపట్ల ప్రీతి చూపించాడు. ఏశావు నైపుణ్యంగల వేటగాడు, ఏశావు వేటాడి తెచ్చినవాటిని ఇస్సాకు ఇష్టంగా భుజించేవాడు. ఇస్సాకు భార్య రిబ్కా దృఢసంకల్పంగల అన్నిటిని నియంత్రించగల స్త్రీ. ఇంటి వ్యవహారాలన్నీ ఆమే చూస్తూ, తాను గారాబంచేసే యాకోబును దృష్టిమాంద్యంగల తన భర్త ఆశీర్వదించేలా తనకనుకూలంగా పరిస్థితిని మలచుకున్న ధైర్యవంతురాలు రిబ్కా. ఈ కుమారుడు (యాకోబు) గుడారాల్లోనూ ఉంటూ ఇంటిపనుల్లోను మందలపట్ల ఆసక్తి చూపించేవాడు.

దృఢసంకల్పాల మధ్య సంఘర్షణ, పక్షపాతం, విభిన్న స్వభావాలు, నిర్దయతో కూడిన వంచన మొదలైన కథనాలతో, ఈ అధ్యాయం "తనకు తానే విరోధముగా వేరుపడిన ... ఏ యిల్లయినను నిలువదు" (మత్తయి 12:25) అనేదాన్ని సవివరంగా చూపిస్తోంది. అసత్యం మరియు వంచననుండి ఉత్పన్నమయ్యే నమ్మకద్రోహం, భయం, ఆగ్రహం, ద్వేషం మొదలైనవాటివలన కలిగే గాయాలు ఈ అధ్యాయంలో సుస్పష్టంగా కనబడతాయి; ఇవి ఇటు తల్లిదండ్రుల జీవితాల్లోను, అటు వారి కుమారుల జీవితాల్లోను తీవ్రమైన దుఃఖం మిగిల్చాయి. కొన్ని గాయాలు ఇరవై సంవత్సరాల తర్వాత చివరగా మానిపోగా (33:1–17); మరికొన్ని ఎన్నటికీ పూర్తిగా మానలేదు. దీవెన పోగొట్టుకున్న ఏశావు తీవ్రంగా దుఃఖపడి యాకోబుపట్ల

మితిమీరిన ద్వేషం పెంచుకున్నాడు, ఈ విద్వేషం చాలా కాలం కొనసాగింది. యాకోబు తనను చంపాలని ప్రయత్నిస్తున్న తన అన్న పట్ల భయంతోను మరియు పెళ్లిచేసుకోడానికి ఇంటిని విడిచిపెట్టి పద్దనరాముకు వెళ్లాడు. రిబ్కాకు తాను ప్రేమించిన కొడుకు దగ్గర లేడు; ఆమె మళ్లీ యాకోబును చూచినట్టు వాక్యభాగంలో లేదు. ఇస్సాకు దుఃఖం గురించి వివరాల్లేవు, తన భార్య తన కొడుకు ఇద్దరూ చేసిన ఉపాయానికి వంచనకు అతని దుఃఖం రెండింతలుగా ఉందేమో.

ఈ కథలో విషాదం అనేది చివరి మాట కాదు. జీవితమనే రంగస్థలంమీద పాత్రధారులు తమ పాత్రను ముగించుకొని వెళ్లిన తర్వాత కూడా కొనసాగిన విచిత్రనాటకంలో ఇది ఒక అంకం మాత్రమే. ఈ కథ మనిషి లోని పాపాన్ని, బాధను, విడిపోయిన బంధుత్వాల్ని నొక్కి చెప్పడంలేదు, అయితే దుర్బలులైన మనుషుల పట్ల దేవుని అద్భుత కృపయొక్క కార్యసాధకతను కథ ఆద్యంతం చూడగలం. వీరు అర్హులనీ యోగ్యులనీ కాదు – వారి బలహీనతల్లోనే వారి పాపాల్లోనే – ఆయన మనుషుల్ని పిలుస్తాడు, వారిని ఆశీర్వదిస్తాడు, వారిద్వారా తన కార్యాల్ని కొనసాగిస్తాడు. అబ్రాహాముయొక్క వాగ్దాన సంతానమైన యేసు క్రీస్తుద్వారా ఆయన విమోచన ప్రణాళిక అంతిమంగా సర్వలోకానికి దైవిక ఆశీర్వాదాల్ని అందించే మనుషుల్ని ఉత్పత్తి చేసింది (మత్తయి 1:1–16; గలతీ. 3:16).

## ఇస్సాకు ఆశీర్వాదము కొరకు కుట్ర మరియు ఎదురు కుట్ర

## (27:1–17)

### ఇస్సాకు మనవి (27:1–4)

**[1]ఇస్సాకు వృద్ధుడై అతని కన్నులకు మందదృష్టి కలిగినప్పుడు అతడు తన పెద్ద కుమారుడైన ఏశావుతో – నా కుమారుడా అని అతని పిలువగా అతడు – చిత్తము నాయనా అని అతనితో అనెను. [2]అప్పుడు ఇస్సాకు – ఇదిగో నేను వృద్ధుడను, నా మరణదినము నాకు తెలియదు. [3]కాబట్టి నీవు దయచేసి నీ ఆయుధములైన నీ అంబులపొదిని నీ విల్లును తీసికొని అడవికి పోయి నాకొరకు వేటాడి మాంసము తెమ్ము. [4]నేను చావక మునుపు నిన్ను నేను ఆశీర్వదించునట్లు నాకిష్టమైన రుచిగల భోజ్యములను సిద్ధపరచి నేను తినుటకై నాయొద్దకు తెమ్మని చెప్పెను.**

**వచనములు 1, 2.** కాలం గడిచేకొద్దీ, **వృద్ధుడైన** ఇస్సాకు **కన్నులకు మందదృష్టి** కలిగింది. దృష్టి మాంద్యం లేదా అంధత్వం వృద్ధాప్యములో సాధారణ లక్షణం (48:10; 1 సమూ. 3:2; 4:15; 1 రాజులు 14:4; మరియు ద్వితీ. 34:7 చూడండి). కళ్లు సరిగ్గా కనబడని ఇస్సాకు, **తన పెద్ద కుమారుడైన ఏశావును తన** వద్దకు **పిలువగా**, అతను **చిత్తము నాయనా** అని జవాబిచ్చాడు. అతని తండ్రి అతనితో తాను

వృద్ధుడనయ్యానని తన **మరణదినము** సమీపంగా ఉన్నదని చెబ్తూ, తాను మరణించేముందు సంప్రదాయికంగా వస్తున్న ఆశీర్వదాన్నివ్వాలని సిద్ధపడినట్టు కోరుకున్నానని వెల్లడించాడు.

క్రిందటి అధ్యాయంలోని సంఘటనలకు, ఈ అధ్యాయంలోని ఈ సంఘటనకు మధ్య ఎంత కాలం గడిచిందో చెప్పడం సాధ్యం కాదు. అధ్యాయం 26లోని సంఘటనలు జరిగిన వెనువెంటనే అధ్యాయం 27లోని సంఘటనలు జరిగి ఉన్నట్లయితే పితరుని వయసు సుమారు వంద సంవత్సరాలుంటుంది (25:26; 26:34), ఆ తర్వాత పితరుడు మరో ఎనబై సంవత్సరాలు జీవించి, నూట ఎనబై సంవత్సరాల వయసులో మరణించి ఉంటాడు (35:28).[1] ఈ సంఘటనలు కొంత కాలం గడిచిన తర్వాత జరిగినవైతే, బహుశా ఇస్సాకుకు నూట ముప్పయి సంవత్సరాల వయసు ఉండవచ్చు. ఇస్సాకు వృద్ధుడు మరియు అంధుడు కాబట్టి, అతనిని ఎవరైనా పట్టుకొని లేవదీసి కూర్చోపెట్టేంత బలహీనుడై ఉండవచ్చు (27:19, 31). అందుచేత, ఏశావు తన తండ్రి మరణం త్వరలోనే సంభవించవచ్చని ఊహించి ఉండవచ్చు (27:41). ఏదేమైనా, ఇది జరిగిన తర్వాత ఇస్సాకు కొంత బలం పుంజుకొని ఉండవచ్చు, ఎందుకంటే అతను ఈ సంఘటన తర్వాత తక్కువలో తక్కువగా మరో ముప్పయి సంవత్సరాలు కచ్చితంగా జీవించి ఉంటాడు (31:41 చూడండి; 35:27, 28).

**వచనములు** 3, 4. ఇస్సాకు తన కుమారుడైన ఏశావును, **నీవు దయచేసి నీ ఆయుధములైన నీ అంబులపొదిని నీ విల్లును తీసికొని అడవికి పోయి నాకొరకు వేటాడి మాంసము తెమ్ము** అని ఆదేశించాడు. ఏశావు తన వేట ముగించి తిరిగివచ్చి తన తండ్రికి ఇష్టమైన **రుచిగల భోజ్యములను సిద్ధ** పర్చాలి.[2] ఇస్సాకు ఏశావుపట్ల పక్షపాతం చూపించడానికి లేదా ప్రేమించడానికి కారణం, "ఇస్సాకు ఏశావు తెచ్చిన వేట మాంసమును తినుచుండెను" అని 25:28 వచనంలో కనబడుతుంది.

ఈ ప్రత్యేకమైన సందర్భానికి ఇస్సాకు చెప్పిన కారణం, **నేను చావక మునుపు నిన్ను నేను ఆశీర్వదించునట్లు** అని తెలుస్తోంది. ఈ మాటలు ఉపదేశాత్మకంగా కనబడుతున్నాయి: ఇస్సాకు "నేను నిన్ను ఆశీర్వదించడానికి" అని మామూలుగా చెప్పలేదు. "జీవం" లేక "ప్రాణం" అనే అర్థాన్నిచ్చే (נֶפֶשׁ, *nepesh*) అనే హెబ్రీ పదం పలుమార్లు వ్యక్తిని కూడా సూచించే నుడికారం అయినప్పటికీ, ఇక్కడ ఇంకా నిగూఢమైన మరియు భావావేశపూరితమైన అర్థాన్ని సూచిస్తోంది. "నేను చావక మునుపు నిన్ను నేను ఆశీర్వదించునట్లు" అని ఇస్సాకు చెప్పడంలో, "నాలో ఉన్న ప్రాణం (లేక, జీవం) లోతుల్లోంచి [*nepesh*] అనీ, లేక నా అంతరంగం లోని సమస్తంలోనుండి నిన్ను ఆశీర్వదించునట్టు" అని చెబ్తున్నాడని అర్థం.

ఇస్సాకు ఈ సందర్భం గురించి యాకోబుతో చెప్పలేదు. ఇది చాలా వింతగా ఉంది, ఎందుకంటే ఆశీర్వాదాలిచ్చే ముఖ్యమైన సందర్భాల్లో మగసంతానమంతా హాజరు కావాలి. కుటుంబంలో జ్యేష్ఠుడినుండి కనిష్ఠుడివరకు వరుసప్రకారం,

అనంతర కాలంలో ఐగుప్తులో యాకోబు తన పిల్లల విషయంలో చేసినట్టుగా (49:1–28),[3] తండ్రి ఒక్కొక్కరిని పిలిచి ఆశీర్వదించాలి. యాకోబును పూర్తిగా విస్మరించాలని ఇస్సాకు ఉద్దేశించినట్టు స్పష్టంగా కనబడుతోంది. "పెద్దవాడు" (ఏశావు) "చిన్నవానికి" (యాకోబు) "దాసుడగును" (25:23) అని యెహోవా రిబ్కాకు సెలవిచ్చిన ప్రవచనాత్మక సందేశాన్ని ఇస్సాకు ఉపేక్షించైనా ఉండాలి లేదా మర్చిపోయైనా ఉండాలి.

## రిబ్కా యొక్క ప్రణాళిక (27:5–17)

**[5]ఇస్సాకు తన కుమారుడగు ఏశావుతో ఇట్లు చెప్పుచుండగా రిబ్కా
వినుచుండెను. ఏశావు వేటాడి మాంసము తెచ్చుటకు అడవికి వెళ్లెను. [6]అప్పుడు
రిబ్కా తన కుమారుడగు యాకోబును చూచి – ఇదిగో నీ తండ్రి నీ అన్నయైన
ఏశావుతో [7]–మృతిబొందకమునుపు నేను తిని యెహోవా సన్నిధిని నిన్ను
ఆశీర్వదించునట్లు నాకొరకు మాంసము తెచ్చి నాకు రుచిగల భోజ్యములను
సిద్ధపరచుమని చెప్పగా వింటిని. [8]కాబట్టి నా కుమారుడా, నా మాట విని నేను నీకు
ఆజ్ఞాపించినట్టు చేయుము. [9]నీవు మందకు వెళ్లి రెండు మంచి మేకపిల్లలను
అక్కడనుండి నాయొద్దకు తెమ్ము. వాటితో నీ తండ్రి కిష్టమైన రుచిగల భోజ్యములను
అతనికి చేసెదను. [10]నీ తండ్రి మృతిబొందక ముందు అతడు వాటిని తిని నిన్ను
ఆశీర్వదించునట్లు నీవు వాటిని నీ తండ్రియొద్దకు తీసికొనిపోవలె ననెను. [11]అందుకు
యాకోబు – నా సహోదరుడైన ఏశావు రోమములు గలవాడు, నేను నున్ననివాడను
గదా. [12]ఒకవేళ నా తండ్రి నన్ను తడవిచూచును, అప్పుడు నేను అతని దృష్టికి
వంచకుడనుగా తూచిన యెడల నా మీదికి శాపమే గాని ఆశీర్వాదము తెచ్చుకొనునని
చెప్పెను. [13]అయినను అతని తల్లి – నా కుమారుడా, ఆ శాపము నామీదికి
వచ్చునుగాక. నీవు నా మాటమాత్రము విని, పోయి వాటిని నాయొద్దకు తీసికొని
రమ్మని చెప్పగా [14]అతడు వెళ్లి వాటిని తన తల్లియొద్దకు తీసికొనివచ్చెను. అతని తల్లి
అతని తండ్రి కిష్టమైన రుచిగల భోజ్యములను సిద్ధపఱచెను. [15]మరియు తన
జ్యేష్ఠకుమారుడగు ఏశావునకు సొగసైన వస్త్రములు ఇంట తన యొద్ద నుండెను
గనుక [16]రిబ్కా వాటిని తీసి తన చిన్నకుమారుడగు యాకోబునకు తొడిగించి ఆ
మేకపిల్లల చర్మములతో అతని చేతులను అతని మెడమీద నునుపు భాగమును
కప్పి [17]తాను సిద్ధపరచిన రుచిగల భోజ్యములను రొట్టెనుతన కుమారుడగు యాకోబు
చేతికియ్యగా.**

**వచనము 5.** ఇస్సాకు తనకు ఇష్టుడైన కుమారుడైన ఏశావుతో మాట్లాడుచుండగా, ఆ మాటలను **రిబ్కా** విన్నది. తన తండ్రిని మెప్పించుటకుగాను **ఏశావు అడవికి వేటకొరకు వెళ్లునంత** వరకు ఆమె ఏమి చేయకుండా అలానే ఉంది. స్పష్టంగా, రిబ్కా మరియు ఇస్సాకులు ఇద్దరు ఒకరితో నొకరు సరిగా

మాట్లాడుకొనునట్లుగా లేరు, మరియు ఇద్దరికీ కూడా ప్రత్యేకమైన ఆలోచనలు ఉన్నాయి.

**వచనములు 6, 7.** ఈ వ్యూహాన్ని **యాకోబుకు** విప్పి చెప్పుటలో ఈ ధారావాహికమంతటిలో రిబ్కా ప్రధాన పాత్రగా కనబడుతుంది. **మృతిబొందకమునుపు నేను తిని యెహోవా సన్నిధిని నిన్ను ఆశీర్వదించునట్లు నాకొరకు మాంసము తెచ్చి నాకు రుచిగల భోజ్యములను సిద్ధపరచుమని చెప్పగా వింటిని** అని ఇస్సాకు **ఏశావుతో** చెప్పాడని బయలుపరచింది.

జన్మహక్కునకు మరియు మరణపడకపై ఇచ్చే ఆశీర్వాదమునకు ఉన్న అనుబంధము స్పష్టముకానిది. జన్మహక్కును కలిగియున్నవాడు—మామూలుగా జ్యేష్ఠుడే అయి ఉంటాడు—స్వాస్థ్యములో దరిదాపుగా రెండు భాగములను పొందుకొన నర్హుడైనప్పటికీ, ఆదికాండము 49:1–28 భాగము ఎప్పుడు ఇలానే ఉండవలసిన అవసరం లేదు అని సూచిస్తుంది. మరణపడకపైన తండ్రి ఇచ్చే ఆశీర్వాదము తను మరణించేముందు జన్మహక్కును ఆమోదింపజేసే సాధారణ విషయమనియు మరియు ఈ రెండు కూడా ఒకే ఆశీర్వాదములో భాగములనియు కొందరు నమ్ముతుంటారు. ఏకమైనప్పటికీ, ఈ రెండు వేరువేరని ఏశావు అర్థం చేసుకున్నాడు; తన తమ్ముడు తనను ఎలా మోసగించాడో ఇస్సాకు ఏశావుతో చెప్పినప్పుడు, రెండు నష్టాలు ఆయనకు జరిగాయని ఏశావు అంటూ, "యాకోబు అను పేరు అతనికి సరిగానే చెల్లినది; అతడు నన్ను ఈ రెండు మారులు మోసపుచ్చెను, నా జ్యేష్ఠత్వము తీసికొనెను, ఇదిగో ఇప్పుడు వచ్చి నాకు రావలసిన దీవెనను తీసికొనెను" (27:36) అని అన్నాడు.[4]

ఈ కథనములో రిబ్కా యొక్క ఆలోచనలు ఏమిటి? పరిశోధించుటకు అవి చాలా కష్టం. యెహోవా ఎన్నుకొనినవాడు యాకోబు అయి ఉన్నాడు అని ఆమెకు తెలుసును గనుక (25:23) ఆమె యొక్క ఆత్మీయమైన విలువలు మరియు ఆలోచనలు మంచిగానే అగుపడుచున్నవి. 27:7లో తన పెనిమిటి మాటలను ప్రస్తావిస్తూ, ఆ ఆశీర్వాదము "యెహోవా సన్నిధిని" చోటుచేసుకొనవలసినదిగా ఉన్నదని ఆమె ఇంకా చెప్పింది. కుటుంబ భవిష్యత్తును ఇరకాటంలో పెట్టె ఒక ఇబ్బందికరమైన పరిస్థితి ఇది అని ఆమె గ్రహించి ఉంటుంది, గనుక తన భర్త తన మరణపడక ఆశీర్వాదమును పొరపాటుతో వేరొక కుమారునికి ఇవ్వకుండా ఆపాలని అనుకుంది. రిబ్కా క్రియలకు ఇది కారణమైతే, సరియగు కార్యము జరుగులాగున తగు జాగ్రత్తలు ఆమె తీసుకుంటుంది. అబ్రాహాము సంతానమును గూర్చి యెహోవా ఇచ్చిన దర్శనము మరియు వాగ్దానము నెరవేరాలంటే, ఇస్సాకు మరియు ఏశావుల అవిశ్వాసము నుండి దానిని కాపాడుటకుగాను ఆమె మరియు యాకోబు పని చేయవలసి ఉంది. ఏమైనప్పటికీ, తన గమనాన్ని సాధించుటకుగాను ఆమె అవలంబించిన విధానం చాలా ఆయాసకరంగానే ఉంది! ఇది కుటుంబములో చాలా కాలంపాటు ఉండే శాశ్వతమైన హృదయవేదన మరియు ద్వేషమును

రేకెత్తించునట్లు ఇస్సాకును మోసగించుటకు దారి తీసింది.

**వచనము 8.** ఈ పరిస్థితి యొక్క తీవ్రతను మరియు త్వరితగతిన మరియు చేయవలసిన పనిని రిబ్కా యాకోబుపై ముద్ర వేయాలనుకొంది అనడానికి ఆమె ఆయనకు ఇచ్చిన ఆజ్ఞే ఆధారం. మొదటిగా ఆమె అంది, **నా మాట విని నేను నీకు ఆజ్ఞాపించినట్టు చేయుము.** పాతనిబంధనలో ఇక్కడ ప్రయోగించినట్లుగా స్త్రీలింగపు క్రియారూపములో "ఆజ్ఞ" (צָוָה, *tsawah*) అనే మాటను వాడటం అసాధారణం (ఎస్తేరు 4:5 చూడండి). లేఖనములలో అధికారము కలిగిన ప్రాథమిక వ్యక్తిగా దేవుడు మాత్రమే ఈ పదమును తరచుగా వాడేవాడు. రాజులు మరియు ప్రవక్తల వంటి తక్కువ అధికారము కలిగిన వారు కూడా ఆజ్ఞలు ఇచ్చేవారు; మరియు తండ్రులు తమ పిల్లలకు ఆజ్ఞలు ఇచ్చేవారు. ఈ విషయంలో చూస్తే, తన ఆజ్ఞకు యాకోబు విధేయుడగులాగున తనకున్న మాతృ అధికారాన్ని అంతటిని కూడగట్టుకుంది. ఈ ఇద్దరు తల్లిదండ్రులు తమ పిల్లలతో మాట్లాడేటప్పుడు అనుసరించిన విధానం గమనార్హం. 27:5లో ఇస్సాకు ఏశావుతో "మాట్లాడాడు," కాని రిబ్కా ఇక్కడ యాకోబుకు "ఆజ్ఞాపించింది." ఈ పద బేధము దేనిని సూచిస్తుంది అంటే చిన్న కుమారునిపై తల్లి అభిమాయిషి చూపగా, తండ్రి అయితే తన పెద్ద కుమారునితో మృదువైన సంబంధాన్ని కలిగియున్నాడు.

**వచనములు 9, 10.** యాకోబు **మందకు వెళ్లి రెండు మంచి మేకపిల్లలను అక్కడనుండి** [ఆమె] **యొద్దకు** తీసుకువస్తే ఇస్సాకు కొరకు ఆమె తన **కిష్టమైన రుచిగల భోజ్యములను అతనికి చేయాలని** రిబ్కా యొక్క ఆజ్ఞ. యాకోబు మంచి వంటవాడు అని ఈ వాక్యభాగము ఇప్పటికే బయలుపరచింది (25:27–34); అయినప్పటికీ, ఈ సందర్భంలో అసలు పొరపాటు జరగడానికి అవకాశం లేదని తన తల్లియొక్క ఆలోచన. ఇస్సాకు తన మందలోని ఒక మేకపిల్ల మాంసమును గాక వేటాడబడిన ఒక మేకపిల్ల మాంసమునే తింటున్నాననే అనుభూతి కలుగులాగున కావాల్సిన మషాలాలను కలిపి ఆయనను మోసగించుటకు ఒక మంచి భోజ్యమును సిద్ధపరచుట ఆమెకు మాత్రమే తెలుసునని రిబ్కా గొప్ప నిశ్చయతతో ఉంది. ఆమె భోజ్యమును సిద్ధపరచుట ముగించిన తరువాత, ఆమె యాకోబుతో **నీ తండ్రి మృతిబొందక ముందు అతడు వాటిని తిని నిన్ను ఆశీర్వదించునట్లు నీవు వాటిని నీ తండ్రియొద్దకు తీసికొనిపోవలెను** అని చెప్పింది.

**వచనములు 11, 12.** ఏశావులా నటించి తన తండ్రిని మోసగించమని **తన తల్లి** చెప్తుందని **యాకోబు**కు తెలుసు. ఆయన, **నా సహోదరుడైన ఏశావు రోమములు గలవాడు, నేను నున్ననివాడను గదా** (25:25 చూడండి) అని చెప్పాడు. ఒకవేళ ఇస్సాకు తనను **తాకినట్లయితే**, వెంటనే ఈ పథకమంతటిని కనుగొని తన చిన్న కుమారుని ఒక **మోసగాని**గా భావిస్తాడని ఆయనకు తెలుసు. ఇక్కడ תָּעַע (*tha'a'*) అనే హెబ్రీ పదమునకు అసమాపక రూపములో ఉంది, దీనిని ఇంకా అక్షరాలా "పరిహాసకుడు" (2 దిన. 36:16 చూడండి) లేదా "జిత్తులమారి" (NJPSV) అని

అనువదించవచ్చు. తరువాతి కాలంలో, మోషే యొక్క ధర్మశాస్త్రము వికలాంగులను ఆసరాగా తీసుకున్న వారిని శిక్షించింది, ప్రత్యేకంగా గ్రుడ్డివారిని (లేవీ. 19:14; ద్వితీ. 27:18). యాకోబు కాలములో ఈ విషయము అర్థము చేసుకొనబడినప్పటికి కూడా, తన తల్లి యొక్క ఆజ్ఞపై ఆయనకున్న సందేహము నైతిక నియమమును అనుసరించినది కాదు. విరుద్ధంగా, తన తండ్రి తన మోసాన్ని కనుగొంటాడేమోనని భయపడ్డాడు; అప్పుడు, **ఆశీర్వాదము**నకు బదులుగా, మార్చలేని ఒక **శాపము**ను ఆయన పొందుకుంటాడు.

కనాను దేశమును స్వతంత్రించుకొనుటకు మునుపు, ఇశ్రాయేలును శపించుటకు మోయాబీయులు బాలామును నియమించుకున్నప్పుడు, దేవుడు ఆయన మాటలను ఆశీర్వాదములుగా మార్చాడు (సంఖ్యా. 22:4–6, 12; 23:7, 8; ద్వితీ. 23:5; నెహెమ్యా 13:2). దేవుడు ఆ ప్రవక్తను ప్రజలను శపించకుండా నిరోధించాడు గనుక అది ఒక అపూర్వమైన విషయం. ఇంకా, అది యాకోబు జీవితమునకు చాలా కాలము తరువాత జరిగింది. తన తండ్రికి తన జిత్తులమారితనము తెలిసినప్పుడు మంచిగానే స్పందిస్తాడని యాకోబు అనుకున్నట్లుగా ఏమియు ఇక్కడ సూచించుటలేదు. నియమముగా, ఒకసారి ఒక వ్యక్తి ఆశీర్వాదమును లేదా శాపమును పలికినచో, దానిని తిరిగి తీసుకొనుటకు కుదరదు.

**వచనము 13.** ఇస్సాకు ఈ తంత్రమును గ్రహించి తనపై ఆశీర్వాదములకు బదులుగా శాపములను పలుకుతాడనే యాకోబు యొక్క భయమును బాపుటకు రిబ్కా మరలా తనకు పునఃనిశ్చయత కలిగిస్తూ అంటుంది, **ఆ శాపము నామీదికి వచ్చునుగాక** అని. ఇంకో విధంగా, తన తండ్రి ఆశీర్వాదము యొక్క లాభాలన్నిటిని ఆమె యాకోబుకు ప్రమాణము చేసింది, అయినను ఒకవేళ వారి వంచన విఫలమైతే శాపములలోని ఏ ఒక్క శిక్షను కూడా ఆయన పొందడని చెప్పింది. తన ప్రణాళికను బట్టి రిబ్కా తన జీవితములోను మరియు తన వివాహములోను కూడా తీవ్రమైన పర్యావసానాలాను ఎదుర్కొనుటకు ఇష్టత చూపింది; కాబట్టి, యాకోబు తన **మాటమాత్రము విని** ఇస్సాకునకు భోజ్యములను సిద్ధపరచునట్లుగా రెండు మేకపిల్లలను తీసుకురమ్మని ఆమె బ్రతిమాలింది (27:9).

**వచనములు 14–17.** తన మోసపూరితమైన ప్రణాళికను జరిగించుటకు రిబ్కా అనుసరించిన విధానమును తరువాతి కొన్ని వచనములు వివరిస్తున్నవి. యాకోబు మేకపిల్లలను **తన తల్లియొద్దకు తీసికొని** రాగానే, ఇస్సాకునకు **ఇష్టమైన రుచిగల భోజ్యములను** (27:4, 7, 9) చేసింది. ఇక్కడ, ఇస్సాకునకు ఏశావును ఇష్టపడునట్లు చేసి మరియు తన కుటుంబములో కలహాలను మరియు విభజనలను కలిగించిన వేట పట్ల తనకున్న ఆకలిని ఈ వాక్యభాగము తెలుపుతుంది.

తన చిన్న కుమారుని యొక్క వస్త్రములు పెద్ద కుమారుని వస్త్రములవలె

వాసన రాకున్నా లేదా అలా అనిపించకపోయినా తన భర్త వెంటనే పసిగట్టే విషయమును గూర్చి **రిబ్కా** ఏమియు చెప్పకపోయినా, ఆమె దేనిని కూడా అవకాశమునకు వదిలిపేయలేదు. ఆమె యాకోబుకు **ఏశావునకున్న సొగసైన వస్త్రములు తొడిగించి ఆ మేకపిల్లల చర్మములతో అతని చేతులను అతని మెడమీద నునుపు భాగమును కప్పి** సిద్ధపరచింది. రిబ్కా యొక్క మోటైన వంచనకు యాకోబు పడిపోతాడా అనే ఆలోచనను చాలా మంది అసంబద్ధంగా కొట్టిపారేస్తారు; అయినప్పటికీ, తన భర్త యొక్క భౌతికమైన శక్తి ఎంతగా క్షీణించిపోయాయో అనేదానికి ఇది మనస్సును కరిగించే సాక్ష్యం. ఇస్సాకు యొక్క కళ్లు మాత్రమే విఫలమవ్వడం కాదు, తన యొక్క స్పృశించే శక్తి కూడా బలహీనపడి ఉంటుంది. ఆఖరుగా, **తాను సిద్ధపరచిన రుచిగల భోజ్యములను రొట్టెను తన కుమారుడగు యాకోబు చేతికి** ఇస్సాకుకు దానిని ఇవడానికి ఇచ్చింది.

## మోసగించబడిన తరువాత ఇస్సాకు యాకోబునకు ఇచ్చిన ఆశీర్వాదములు (27:18–29)

**[18]అతడు తన తండ్రియొద్దకు వచ్చి – నా తండ్రీ, అని పిలువగా అతడు – ఏమి
నా కుమారుడా, నీ వెవరవని అడిగెను [19]అందుకు యాకోబు – నేను ఏశావు అను నీ
జ్యేష్ఠకుమారుడను, నీవు నాతో చెప్పినప్రకారము చేసియున్నాను నీవు నన్ను
దీవించుటకై దయచేసి లేచికూర్చుండి, నేను వేటాడి తెచ్చినదానిని తినుమనెను.
[20]అప్పుడు ఇస్సాకు నా కుమారుడా, ఇంత శీఘ్రముగా అది నీ కెట్లు దొరికెనని
అడుగగా అతడు – నీ దేవుడైన యెహోవా నా యెదుటికి దాని రప్పించుటచేతనే అని
చెప్పెను. [21]అప్పుడు ఇస్సాకు నా కుమారుడా, నీవు ఏశావను నా కుమారుడవో కావో
నేను నిన్ను తడవి చూచెదను దగ్గరకు రమ్మని చెప్పెను. [22]యాకోబు తనతండ్రియైన
ఇస్సాకు దగ్గరకు వచ్చినప్పుడు అతడు అతని తడవిచూచి – స్వరము యాకోబు
స్వరము గాని చేతులు ఏశావు చేతులే అనెను. [23]యాకోబు చేతులు అతని
అన్నయైన ఏశావు చేతులవలె రోమము గలవైనందున ఇస్సాకు అతనిని గురుతు
పట్టలేక అతనిని దీవించి [24]– ఏశావు అను నా కుమారుడవు నీవేనా అని అడుగగా
యాకోబు – నేనే అనెను. [25]అంతట అతడు అది నాయొద్దకు తెమ్ము; నేను నిన్ను
దీవించునట్లు నా కుమారుడు వేటాడి తెచ్చినది తిందుననెను; అతడు తెచ్చినప్పుడు
అతడు తినెను; ద్రాక్షారసము తేగా అతడు త్రాగెను. [26]తరువాత అతని తండ్రియైన
ఇస్సాకు – నా కుమారుడా, దగ్గరకువచ్చి నన్ను ముద్దుపెట్టుకొమ్మని అతనితో
చెప్పెను. [27]అతడు దగ్గరకు వచ్చి అతని ముద్దుపెట్టుకొనెను. అప్పుడతడు అతని
వస్త్రములను వాసనచూచి అతని దీవించి యిట్లనెను.**

**ఇదిగో నా కుమారుని సువాసన**

**యెహోవా దీవించిన చేని సువాసనవలె నున్నది.**
**28ఆకాశపుమంచును భూసారమును**
**విస్తారమైన ధాన్యమును ద్రాక్షారసము**
**దేవుడు నీ కనుగ్రహించుగాక**
**29జనములు నీకు దాసులగుదురు**
**జనములు నీకు సాగిలపడుదురు**
**నీ బంధుజనులకు నీవు ఏలికవై యుండుము**
**నీ తల్లి పుత్రులు నీకు సాగిలపడుదురు**
**నిన్ను శపించువారు శపింపబడుదురు**
**నిన్ను దీవించువారు దీవింపబడుదురుగాక.**

**వచనము 18.** ఈ వాక్యభాగము ఆదికాండములో అత్యంత ఉత్కంఠభరితమైన భాగాలలో ఒకటి, తన చిన్న కుమారుడు తనను వంచించి తన చిత్తమును అడ్డుకునే క్రూరమైన పథకమును వేశాడని ఇస్సాకు కనుగొంటాడా అని ఈ భాగము చదువరికి ఆసక్తిని కలిగిస్తుంది. యాకోబు ఇస్సాకు గుడారములోనికి ప్రవేశించగా, ఆయన **నా తండ్రీ** అని పలుకుతూ వినయపూర్వకమైన విన్నపము చేసాడు. ఇస్సాకు తన సన్నిధిని ధృవపరుస్తూనే, తరువాత ఒక అనుమానాస్పదమైన ప్రశ్న అడిగాడు: **నా కుమారుడా, నీ వెవరవి** అని అడిగాడు.

**వచనము 19. యాకోబు** ఒక అబద్ధాల పరంపర మొదలుపెట్టాడు. మొదటిగా, **నేను ఏశావును** అని చెప్పి, తరువాత **నీ జ్యేష్ఠ కుమారుడను** అని పలికాడు. ఆ తరువాత **నీవు నాతో చెప్పినప్రకారము చేసియున్నాను** అని అన్నాడు. ఒక జంతువును వేటాడి ఆయన భుజించులాగున రుచిగల భోజ్యములను చేశాడని యాకోబు ఇస్సాకుతో ఇక్కడ అంటున్నాడు. కాబట్టి తన తండ్రితో **నీవు నన్ను దీవించుటకై దయచేసి లేచికూర్చుండి, నేను వేటాడి తెచ్చినదానిని తినుము** అని అన్నాడు. ఏశావు తిరిగి వచ్చి అవమానకరమైన తన వంచనను తేటపరచక ముందే, తన తండ్రి తినుట ముగించి తనపై తన ఆశీర్వాదమును పలకాలని యాకోబుకు తెలుసు అనే విషయాన్ని ఈ విన్నపములోని వేగిరపాటు మరుగుచేస్తుంది.

**వచనము 20.** ఏశావు గొప్ప ప్రతిభ కలిగిన వేటగాడు అని **ఇస్సాకు**కు తెలుసు, కాని ఆయనను ఈ పనిపై పంపించిన తరువాత చాలా తక్కువ సమయమే జరిగింది కాబట్టి ఆయన కొంచెం దిగ్భ్రాంతి చెందాడు. **నా కుమారుడా, ఇంత శీఘ్రముగా అది నీ కెట్లు దొరికెనని** ఆయన అడిగాడు. తన తండ్రి సంధించిన ఈ సవాలు యాకోబును నిశ్చేష్టుడిని చేసి ఉంటుంది. ఆయన స్పందన రెండింతలు విషాదకరంగా ఉంది; ఎందుకంటే ఈ అబద్ధం పవిత్రమైన నామమగు యెహోవా నామమును కూడా ప్రస్తావించింది. **నీ దేవుడైన యెహోవా నా యెదుటికి దాని రప్పించుటచేతనే** అని

యాకోబు అన్నాడు. ఇట్టి మోసపూరిత విధానంలో దేవుని నామమును ఉచ్చరించుట ద్వారా, యాకోబు యొక్క పాపము ఇంకా లోతుగా వెళ్ళింది. భోజ్యములతో ఇంత వేగముగా వచ్చుటకు దేవుడే కారణమని ఆయన అంటున్నాడు. ఇంకా, "నీ దేవుడు" అనే మాటలు ఈ సమయము వరకు యాకోబు యెహోవాను ఇంకా తన దేవునిగా పరిగణించలేదని సూచిస్తున్నవి. తరువాత, ఆయనను తన దేవునిగా చేసుకొనుటకు నిశ్చయించుకొనిన తరువాత, తన సమర్పణకు కొన్ని షరతులను యాకోబు విధించాడు (28:20, 21; 31:5, 42; 32:9 చూడండి).

**వచనములు 21, 22.** యాకోబు మాటలచే ఒప్పించబడని **ఇస్సాకు** ఇంకా, **నా కుమారుడా, నీవు ఏశావను నా కుమారుడవో కావో నేను నిన్ను తడవి చూచెదను దగ్గరకు రమ్మని** అన్నాడు. వయస్సైన తన భర్తను మోసగించుటకు రిబ్కా సరిపడినంత వేషమును యాకోబుకు వేసి పంపింది. కాబట్టి, **యాకోబు ఇస్సాకు దగ్గరకు వచ్చినప్పుడు**, ఆయన తన చేయిచాచి, **అతని తడవిచూచి**, తన సందేహాన్ని వ్యక్తపరుస్తూ: **స్వరము యాకోబు స్వరము గాని చేతులు ఏశావు చేతులే** అని అన్నాడు.

**వచనము 23.** ఈ సమయములో రచయిత చదువరి కొరకు కొంత వివరణను వ్రాసాడు: **యాకోబు చేతులు అతని అన్నయైన ఏశావు చేతులవలె రోమము గలవైనందున ఇస్సాకు అతనిని గురుతు పట్టలేదు.** ఇస్సాకు యాకోబును విన్నాడు, కాని తడవినప్పుడు ఏశావు వలె ఉన్నందున **అతనిని దీవించెను.** 27:27 వరకు కూడా లాంఛనమైన మరణపడకపు ఆశీర్వాదాన్ని ఇవ్వలేదు గనుక ఇక్కడ ఈ వాక్యము ద్వారా రచయిత ఏమనుకుంటున్నాడు? ఒక ఆలోచన ఏమంటే 27:23లో ఇస్సాకుచే పలుకబడిన ఆశీర్వచనము, తరువాత ఇవ్వబోయేదానికంటే తక్కువ ప్రత్యేకత కలిగి ఉన్నది అని అర్థం.

**వచనము 24.** రిబ్కా ఈ ప్రణాళికను పన్నినప్పుడు తన కవల పిల్లల స్వరములలోని బేధములను గూర్చి తప్ప ప్రతి ఒక్క విషయమును గూర్చి సుస్పష్టంగా ఆలోచించింది; కాబట్టి ఏశావు యొక్క స్వరమును అనుకరించడంలో యాకోబుకు శిక్షణ ఇవ్వలేక పోయింది. ఇది ఇస్సాకుకు తను మాట్లాడుతున్న వ్యక్తి యొక్క గుర్తింపుపై కొంచెం సందేహాన్ని కలిగించేటట్లు చేసింది, కాబట్టి **ఏశావు అను నా కుమారుడవు నీవేనా** అని ఆయన అడిగాడు. తన తండ్రి ప్రశ్న యాకోబును కొంచెం ఇబ్బంది పెట్టి ఉంటుంది, కాని ఆయన **నేనే** అని బదులిచ్చాడు.

**వచనము 25.** తన కుమారుని యొక్క నిశ్చయరూపమైన జవాబును విన్నప్పుడు ఇస్సాకు ఇలా అన్నాడు, **అది నాయొద్దకు తెమ్ము; నేను నిన్ను దీవించునట్లు నా కుమారుడు వేటాడి తెచ్చినది తిందును.** ఈ విన్నపమును నెరవేర్చుటకు యాకోబు రుచిగల భోజ్యములను తన తండ్రికి ఇచ్చాడు, మరియు **అతడు తినెను.** యాకోబు ఆయనకు **ద్రాక్షారసము తేగా అతడు త్రాగెను.** యాకోబు

తన తండ్రికి ద్రాక్షారసమును ఎందుకు తెచ్చాడు? ఇస్సాకు యొక్క మూల విన్నపములో ఈ విషయము ప్రస్తావించబడలేదు గనుక మనము ఖచ్చితముగా చెప్పలేము. అయినప్పటికీ, ప్రాచీన పశ్చిమ ఆసియాలోని అధికారులు ఈ విధంగా సలహా ఇస్తారు: మొదటిది, ప్రాచీన కాలములలో ద్రాక్షారసము సాధారణమైన పానము, ప్రత్యేకంగా ఈ విధమైన భోజనముల సమయములో (14:18–20 చూడండి). అట్టి భోజ్యములతో బాటు ద్రాక్షారసము కూడా ఇవ్వబడవలసి ఉన్నదని ఇస్సాకునకు తెలిసియున్నప్పుడు ప్రత్యేకంగా దానిని కోరవలసిన అవసరం లేదు. రెండవదిగా, తన తండ్రి ద్రాక్షారసమును త్రాగుతాడని యాకోబుకు తెలుసు; ఇంకా ఇస్సాకు ద్రాక్షారసమును ఎక్కువగా పానము చేసి తన జ్ఞానేంద్రియాలను బలహీనపరచుకొని, ఎక్కువయైన ప్రశ్నలను అడిగి తన వంచనను కనుగొనకుండా ఉంటాడని కూడా యాకోబు ఆశించి ద్రాక్షారసము ఇచ్చి ఉంటాడు. ఈ రెంటిలో ఒకటి లేదా ఈ రెండు కారణములు ఆ ప్రాముఖ్యమైన సందర్భంలో తన తండ్రికి ద్రాక్షారసమును పోయునట్లు యాకోబును ప్రేరేపించి ఉంటాయి.

**వచనము 26.** స్పష్టంగా, తన మనస్సును నీరసపరచుకొనే అంతగా **ఇస్సాకు** ద్రాక్షారసపానము చేయలేదు, ఎందుకంటే ఆయనకు ఈ ఉదంతం అంతటిని గూర్చి ఇంకా సందేహాలు ఉన్నాయి. తన కంటి చూపు తనకు సహాయపడకున్నా, తన వినికిడి తనపై కొన్ని మాయలు చేస్తున్నా, ఈయన తన పెద్ద కుమారుడా లేక చిన్న కుమారుడా అను ఈ ప్రశ్నను పరిష్కరించుటకు ఒక ఆఖరిప్రయత్నాన్ని చేసాడు: **నా కుమారుడా, దగ్గరకువచ్చి నన్ను ముద్దుపెట్టుకొమ్మని** అతనితో చెప్పాడు. ఈ విన్నపము చేయుట ద్వారా పితరుడు ఏమి చెప్తున్నాడు అంటే ఆయనలోని వాసన పసిగట్టే శక్తి తనకు సాధ్యపడే ఎట్టి మోసము నుండి అయినను ఆయనను హెచ్చరించగలదని తనకు నిశ్చయత ఉన్నట్లుగా చెప్తున్నాడు.

**వచనము 27.** ఈ విన్నపమునకు బదులుగా, యాకోబు తన తండ్రివద్దకు వెళ్లి **అతని ముద్దుపెట్టుకొనెను; అప్పుడతడు** [ఇస్సాకు] **అతని వస్త్రములను వాసనచూచి అతని దీవించెను.** యాకోబు ధరించిన వస్త్రముల వాసన కారణముగాను, ఇంకా తన చేతులను మరియు మెడను కప్పిన తోళ్ల యొక్క వాసన కారణముగాను, అతను ఏశావేనని ఇస్సాకు భావించాడు. కాబట్టి ఈ వంచన ఫలించింది, మరియు విశాలమైన ఖాళీ పొలములు మరియు ప్రదేశాలను వేట కొరకు ఇష్టపడే ఏశావునకు వాటిపై ఉన్న ప్రేమను గూర్చి ప్రస్తావిస్తూ ఇస్సాకు తన ఆశీర్వచనమును ప్రారంభించాడు. అలానే, **ఇదిగో నా కుమారుని సువాసన యెహోవా దీవించిన చేని సువాసనవలె నున్నది** అనే పరిశీలన చేసాడు.

**వచనము 28.** మొదటి ఆశీర్వాదము భూమి యొక్క సారమును గూర్చి ప్రస్తావిస్తూ అబ్రాహామునకిచ్చిన వాగ్దానమును (12:1, 7) ప్రతిధ్వనిస్తుంది: **ఆకాశపుమంచును భూసారమును విస్తారమైన ధాన్యమును ద్రాక్షారసము దేవుడు నీ కనుగ్రహించుగాక.** ప్రాచీన కనానులో నీటి పారుదలతో వాస్తవికంగా ఏ

వ్యవసాయము కూడా ఐగుప్తులో జరిగినట్లుగా జరిగేది కాదు. ఎక్కువ శాతం ఉత్పత్తి ఎండిన నేలలో చేసే సాగుతోనే వచ్చేది, ఇది మొదటి వర్షంపై ఆధారపడి ఉండేది. కాగా, వర్షం లేని ఎండాకాలంలో పంటలు పండాలంటే మధ్యధరా సముద్రము నుండి గాలిచే తేబడే "మంచు" చాలా ప్రాముఖ్యమైనది. "భూసారము" అనే ప్రస్తావన ఇక్కడ పంటల యొక్క ఔన్నత్యానికి అలంకారంగా ఉంది, ప్రత్యేకంగా "విస్తారమైన ధాన్యమును ద్రాక్షారసమును" అను పౌష్టికమైన ఆహారములు.

ఇస్సాకు మరియు ఆయన కుటుంబము ప్రాముఖ్యముగా కాపరులు మరియు మందలను కాయువారు అయి ఉండగా, గెరారు ప్రాంతములో నివసించినప్పుడు వారు విస్తారమైన పంటలను నాటారు మరియు కోశారు (26:12–14). యాకోబు సంతానమువారైన ఇశ్రాయేలీయులు కనాను దేశమును వారు స్వతంత్రించుకున్నప్పుడు మరి ఎక్కువగా వ్యవసాయములో పాల్గొంటారు. స్వాధీనమునకు మునుపు, ఒకవేళ వారు నిబంధనకు నమ్మకస్థులుగా ఉన్నట్లయితే ఆ భూమిలో విస్తారమైన పంటను కోస్తారు అని దేవుడు వారికి వాగ్దానము చేశాడు (ద్వితీ. 7:13; 11:14; 33:28). ఇస్సాకు ఆశీర్వాదమువలె, ఈ వాగ్దానములు కూడా "మంచు," "ధాన్యము," మరియు "ద్రాక్షారసము"లు విస్తారముగా ఉంటాయని ఈ వాగ్దానములు చెప్తున్నాయి.

**వచనము 29.** వ్యవసాయపరమైన విజయమును గూర్చి ప్రస్తావించిన తరువాత ఇస్సాకు యొక్క ఆశీర్వచనము దేవుడు అబ్రాహామునకు వాగ్దానము చేసిన క్రమమునే అనుసరిస్తుంది, ఇది కూడా తరువాత "గొప్ప జనమును" గూర్చి మాట్లాడుతుంది (12:2). యాకోబు యొక్క సంతానము వారు స్థిరపడే జనులుగా మారి తన సొంత దేశములో జీవిస్తూ వారికొరకు ఒక సొంత సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ వ్యవస్థను కలిగి ఉంటారని ఇస్సాకు ఇక్కడ సూచిస్తున్నాడు. ఈ ఆశీర్వాదము దూరంలో ఉన్న భవిష్యత్తుకు కూడా విస్తరించింది, తన కుమారుని యొక్క సంతానము తమ రాజకీయ శత్రువులను జయించే ఒక జనాంగముగా విస్తరిస్తారని ఈ ఆశీర్వచనము ముందుగానే గ్రహిస్తుంది. ఇస్సాకు **జనములు నీకు దాసులగుదురు జనములు నీకు సాగిలపడుదురు** అని పలుకుతూ ఈ జయాన్ని చూస్తున్నాడు.[5]

ఇంటికి దగ్గరలో యాకోబు తన **బంధుజనులకు ఏలిక**యై ఉంటాడు; తన **తల్లి పుత్రులు తనకు సాగిల పడుదురు** (25:23 చూడండి). ఇస్సాకు మరియు రిబ్కాలకు ఏశావు మరియు యాకోబు మినహా వేరే కుమారులు ఉన్నట్లుగా ఆదికాండము ఏమి సూచించుటలేదు, కాని "పుత్రుడు" అనే పదము తరచుగా తమ వెంటనే పుట్టిన వారికంటే కూడా భవిష్యత్తులో వారికి కలుగబోయే సంతానమును గూర్చిన ప్రస్తావనలో కూడా ప్రయోగించబడింది. ఉదాహరణకు మత్తయి 1:1లో యేసు అబ్రాహాము మరియు దావీదుకు కూడా "కుమారుని"గా పిలువబడ్డాడు. కొన్ని సందర్భాలలో, "సహోదరులు" అనే పదము "సమీప బంధువు" లేదా

“బంధువు”లను కూడా సూచిస్తుంది (13:8; 16:12; 24:27; 25:18; 31:46). కీలకమైన ఆలోచన ఏమంటే ఇక్కడ ఈ ఆశీర్వచనములో తెలియకుండానే ఇస్సాకు మరియు రిబ్కాల నుండి వెలువడే గోత్రముల యొక్క నాయకత్వాన్ని యాకోబునకు ఇస్తున్నాడు. ఏశావు మరియు ఆయన కుమారులు అక్షరాలా యాకోబునకు సాగిలపడి ఆయనను సేవించారు అనే విషయాన్ని మనము ఎక్కడ చదవము, కాని ఆయన సంతానము వారు (ఎదోమీయులు) దావీదు కాలములో యాకోబు సంతానము వారికి (ఇశ్రాయేలీయులు) లోనై ఉంటారు (2 సమూ. 8:14).

యాకోబుపై ఇస్సాకు పలికిన ఆశీర్వచనంలోని ఆఖరు విషయం కూడా దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దానము వలెనే ఉంది (12:3), కాని పదముల యొక్క క్రమమును మాత్రమే ఇస్సాకు మార్చాడు, **నిన్ను శపించువారు శపింపబడుదురు నిన్ను దీవించువారు దీవింపబడుదురుగాక.** ఇలా పదక్రమాన్ని మార్చుటకు గల కారణములను వాక్యభాగములో ఇవ్వలేదు; కాని దేవుడు యాకోబు యొక్క తాతను మెసొపొతామియా నుండి పిలిచినప్పుడు, ఆయన యొక్క ఉద్ఘాటన శాపముపై గాక ఆశీర్వాదము పైనే ఉంది. అబ్రాహామునకు దేవుడిచ్చిన శుభవార్త ఏమనగా ఆయన వ్యక్తిగతంగా అనుభవించే ఆశీర్వాదముల కంటే ఎక్కువగా ఆయన విశ్వాసాన్ని విశాలపరచాలని అనుకున్నాడు. సారాంశంలో, దేవుడు తన ఆశీర్వాదములను “భూమి యొక్క సమస్త వంశముల” (12:3) పైన కుమ్మరిస్తుండగా ఈ పితరుని సంతానము ద్వారా ఆయన చేయదలచుకున్నదానిని భవిష్యత్తులో నెరవేర్చడం తన విశ్వాస నేత్రము ద్వారా చూడాలని దేవుడు అనుకున్నాడు.

ఫిలిష్తీయులతో ఇస్సాకుకు ఉన్న చెడు అనుభవాలను బట్టి “శాపము” బహుశా ఆయన ఆలోచనలో ఎక్కువగా ఉండి ఉంటుంది. ఒక విధంగా ఆయన బావులను దొంగిలించి మరి కొన్నిటిని నింపుట ద్వారా (26:15–22) వారు అయనను శపించారు. ఇట్టి వివాదములను గూర్చిన ఆలోచన దేవుడు అసలు ఏర్పరచిన ప్రాధాన్యతా క్రమమును మార్చునట్లు చేసింది. జాలిగల తండ్రిలా తన కుమారునిపై దేవుడు ప్రకటించిన దైవిక ఆశీర్వాదముల స్థానములో శాపములు—అంటే హాని మరియు వ్యతిరేకతలు—అధిగమిస్తాయేమో అని ఆయన చూసి ఉంటాడు. దేవుని ఫలభరితమైన ఆశీర్వాదములను, అనగా సమృద్ధియైన నీటిని, భూమి యొక్క సారమును, మరియు లెక్కకు మించిన మందలను మేకలను, అప్పటికే ఆయన అనుభవించాడు కనుక తన సంతానము వారికి వాటిని అందించాలని అనుకున్నాడు.

తన తల్లి యొక్క సహాయము మరియు పట్టు వలన యాకోబు తన సహోదరుడైన ఇస్సాకు యొక్క ఆశీర్వాదములను దొంగిలించగలిగాడు. ఏశావు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మినప్పుడు అంత పశ్చాత్తాపమును చూపలేదు, కాని ఈ ఆశీర్వాదము ఆయన ఎంతగానో కోరుకున్న విషయం. ఆఖరుకు, యాకోబు యొక్క

మోసమునకు చాలా భయంకరమైన పర్యావసానాలు ఉన్నాయి.

## శాపము వలె నున్న ఏశావు యొక్క ఆశీర్వాదము (27:30–40)

30ఇస్సాకు యాకోబును దీవించుటయైన తరువాత యాకోబు తన తండ్రియైన
ఇస్సాకు ఎదుటనుండి బయలుదేరి వెళ్లిన తక్షణమే అతని సహోదరుడైన ఏశావు
వేటాడి వచ్చెను. 31అతడును రుచిగల భోజ్యములను సిద్ధపరచి తన తండ్రియొద్దకు
తెచ్చి – నా తండ్రీ నన్ను దీవించునట్లు లేచి నీ కుమారుడు వేటాడి తెచ్చినదాని
తినుమని తన తండ్రితోననెను. 32అతని తండ్రియైన ఇస్సాకు – నీ వెవరవని అతని
నడిగినప్పుడు అతడు – నేను నీ కుమారుడగు ఏశావు అను నీ
జ్యేష్ఠకుమారుడననగా 33ఇస్సాకు మిక్కుటముగా గడగడ వణకుచు–అట్లయితే
వేటాడిన భోజ్యములను నా యొద్దకు తెచ్చినవారెవరు? నీవు రాకమునుపు నేను
వాటన్నిటిలో తిని అతనిని నిజముగా దీవించితిని, అతడు దీవింపబడినవాడే
యనెను. 34ఏశావు తన తండ్రి మాటలు వినినప్పుడు దుఃఖాక్రాంతుడై పెద్ద కేక వేసి –
ఓ నా తండ్రీ, నన్నును దీవించుమని తన తండ్రితో చెప్పెను. 35అతడు – నీ
సహోదరుడు కపటోపాయముతో వచ్చి నీకు రావలసిన దీవెన తీసికొనిపోయెను.
36ఏశావు – యాకోబు అను పేరు అతనికి సరిగానే చెల్లినది; అతడు నన్ను ఈ రెండు
మారులు మోసపుచ్చెను, నా జ్యేష్ఠత్వము తీసికొనెను, ఇదిగో ఇప్పుడు వచ్చి నాకు
రావలసిన దీవెనను తీసికొనెనని చెప్పి – నాకొరకు మరి యే దీవెనయు మిగిల్చి
యుండలేదా అని అడిగెను. 37అందుకు ఇస్సాకు – ఇదిగో అతని నీకు ఏలికగా
నియమించి అతని బంధుజనులందరిని అతనికి దాసులుగా ఇచ్చితిని; ధాన్యమును
ద్రాక్షారసమును ఇచ్చి అతని పోషించితిని గనుక నా కుమారుడా, నీకేమి
చేయగలనని ఏశావుతో ప్రత్యుత్తరమియ్యగా 38ఏశావు – నా తండ్రీ, నీయొద్ద ఒక
దీవెనయే ఉన్నదా? నా తండ్రీ, నన్ను, నన్నుకూడా దీవించుమని తన తండ్రితో చెప్పి
ఏశావు పరుగెత్తి, యేడ్వగా అతని తండ్రియైన ఇస్సాకు –

39నీ నివాసము భూసారము లేకయు
పైనుండిపడు ఆకాశపు మంచు లేకయు నుండును.
40నీవు నీకత్తిచేత బ్రదుకుదువు
నీ సహోదరునికి దాసుడవగుదువు
నీవు తిరుగులాడుచుండగా
నీ మెడమీదనుండి అతనికాడి విరిచివేయుదువు అని అతని కుత్తరమిచ్చెను.

**వచనము 30.** ఈ కథనమునకు సంఘటనల సమయక్రమము చాలా ప్రాముఖ్యము: **ఇస్సాకు యాకోబును దీవించుటయైన తరువాత యాకోబు తన తండ్రియైన ఇస్సాకు ఎదుటనుండి బయలుదేరి వెళ్లిన తక్షణమే అతని సహోదరుడైన ఏశావు వేటాడి వచ్చెను.** యాకోబు చాలా వేగముగా బయటకు వెళ్లడం

యాదృఛ్ఛికంగా జరిగినదైతే కాదు; తనను చంపుటకు నిశ్చయించుకున్న ఏశావు ఆలోచన క్రమంలో తన ప్రాణమునే అది కాపాడింది (27:41).

**వచనము 31.** ఈ సమయములో తను లేనప్పుడు అసలు ఏమి జరిగిందో ఏశావుకు తెలియదు అనుకోండి! కాబట్టి, ఇస్సాకు బాగా ఇష్టపడిన రుచిగల భోజ్యమును సిద్ధపరచి, **తన తండ్రియొద్దకు తెచ్చి – నా తండ్రీ నన్ను దీవించునట్లు లేచి నీ కుమారుడు వేటాడి తెచ్చినదాని తినుమని తన తండ్రితో** అన్నాడు.

**వచనము 32.** తను విన్నదానిని **ఇస్సాకు** నమ్మలేకపోయాడు. ఏశావు యొక్క మాటను బట్టి సందేహపడిన ఇస్సాకు, **నీవవరివి** అని అడిగాడు. అలాగే, ఇస్సాకు యొక్క ప్రశ్న కూడా ఏశావును దిగ్భ్రాంతికి గురి చేసి ఉంటుంది. అసలుకు తన తండ్రి ఆయనకు చేయమని చెప్పినదంతా ఆయన చేసాడు; కాని, ఇప్పుడు ఆ వేట నుండి తిరిగి వచ్చి వేటాడిన దాని నుండి రుచిగల భోజ్యమును సిద్ధపరచినప్పుడు ఇస్సాకు తన గుర్తింపును అడుగుతున్నాడు. జవాబులో, **నేను నీ కుమారుడగు ఏశావు అను నీ జ్యేష్ఠకుమారుడనని** వెళ్లగక్కాడు.

**వచనము 33.** దీనిని వినినప్పుడు **ఇస్సాకు మిక్కుటముగా గడగడ వణకెను.** ఇక్కడ ప్రయోగించబడిన భాష తను స్వాధీనపరచుకోలేనంతగా వణికినట్లు సూచిస్తుంది. **అట్లయితే వేటాడిన భోజ్యములను నా యొద్దకు తెచ్చినవారెవరు? నీవు రాకమునుపు నేను వాటన్నిటిలో తిని అతనిని నిజముగా దీవించితిని** అనే మాటలో ఆ వ్యక్తి ఎవరో ఇస్సాకు తెలుసుకోవాలని అనుకున్నాడు. ఈ వృద్ధుడైన పితరుడు వేరొకరిని ఆశీర్వదించాడు గనుక ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నాడు. ప్రాచీన పశ్చిమ ఆసియాలో ఉన్న చట్టము మరియు ఆచారముల ప్రకారముగా ఒకవేళ వ్యక్తి మోసము చేసి ఆశీర్వాదములను పొందుకొనినను వాటిని వెనుకకు తీసుకొనుట కష్టమని ఆయనకు తెలుసు. ఇంకా "యెహోవా సన్నిధిలో" (27:7) ఇస్సాకు ఆశీర్వాదములను పలికాడు గనుక వాటిని రద్దు చేయుటకు ప్రయత్నిస్తే దేవుని శాపము క్రిందికి వస్తుందని ఆయన స్పష్టంగానే ఆలోచించాడు. ఒప్పగింతలో **అతడు దీవింపబడినవాడే** అని ఆయన అన్నాడు.

**వచనము 34.** ఏశావు యొక్క బాధ ఇస్సాకు యొక్క బాధవలె ఉన్నది. పెద్ద కుమారుడు తన తండ్రిని బ్రతిమాలుతూ విషాదకరంగా **ఏడ్చి దుఃఖాక్రాంతుడై పెద్ద కేక వేసి – ఓ నా తండ్రీ, నన్నును దీవించుమని తన తండ్రితో చెప్పాడు.** ఇస్సాకు యాకోబునకు ఇచ్చిన ఆశీర్వాదమును మార్చి ఆయనకు ఇస్తాడని ఏశావు ఆశ మీద ఆశతో ఎదురు చూస్తున్నాడు. కొన్ని సంవత్సరాల మునుపు, ఏశావు తన జ్యేష్ఠత్వపు హక్కును (అంటే తన తండ్రి వారసత్వంలో రెండింతలు) అవివేకంగా అమ్మేశాడు. ఈ అవమానానికి తోడు, తన తండ్రి యొక్క ఆశీర్వాదమును కూడా ఇప్పుడే కోల్పోయాడు. ఆయన తన తండ్రిలో మనస్సు మారుతుందని వ్యసనములతో బిగ్గరగా ఏడ్చాడు (హెబ్రీ. 12:16, 17).

**వచనము 35.** ఇస్సాకు ఇచ్చిన సమాధానం తన సొంత ప్రశ్నకు జవాబుగా

ఉంది, ." . . నా యొద్దకు తెచ్చినవారెవరు?" (27:33). ఏశావును ఎందుకు ఆశీర్వదించలేడో ఆయన వివరించాడు. మొదటి వచ్చిన వ్యక్తి తను ఏశావునని చెప్పుకొనుటను బట్టి తనలో అనుమానం తలెత్తిందని ఇస్సాకు ఖచ్చితంగా చెప్పాడు; కాని ఇప్పుడు అసలు ఏమి జరిగిందో ఆయనకు తెలుసు: **నీసహోదరుడు కపటోపాయముతో వచ్చి నీకు రావలసిన దీవేన తీసికొనిపోయెను.** "కపటోపాయము" అని అనువదించబడిన పదము (מִרְמָה, *mirmah*) తన తండ్రిని మాయచేయుటకు యాకోబు ఉద్దేశపూర్వక ప్రణాళిక రచించాడని సూచిస్తుంది.

**వచనము 36. యాకోబు అను పేరు అతనికి సరిగానే చెల్లినది; అతడు నన్ను ఈ రెండు మారులు మోసపుచ్చెను** అని ఏశావు బదులిచ్చాడు. "మోసపుచ్చెను" (עָקַב, *'aqab,* "deceived") అనే పదము 27:35లో ఉన్న పదము కంటే కొంచెం వ్యత్యాసము, మరియు ఇది "యాకోబు" (25:26; యిర్మీయా. 9:4; హోషేయా 12:3 చూడండి) అనే పేరుపై ఒక పదచాతుర్యము ప్రయోగిస్తుంది. తన సహోదరుడు తన **జ్యేష్ఠత్వమును తీసుకున్నాడు** అని చెప్పినప్పుడు ఏశావు చిక్కుడుకాయల వంటకమునకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మివేసికొనుటలో తన సొంత నేరాన్ని (25:29–34) నిర్లక్ష్యం చేస్తూ, సత్యమును పొడిగించాడు. ఆ సందర్భంలో యాకోబు స్పష్టంగా తన అన్న యొక్క పరిస్థితిని ఆసరాగా తీసుకుని తన వంటకము కొరకు ఉన్నతమైన వెల కోరాడు, కాని ఆ ఒప్పందమునకు ఒప్పుకోమని ఏశావును ఎవరు బలవంతం చేయలేదు. ఈ ప్రస్తుత పరిస్థితి వ్యత్యాసమైనది ఎందుకనగా యాకోబు క్రూరమైన మాయను మరియు మోసాన్ని ప్రయోగించి ఇస్సాకు తన జ్యేష్ఠకుమారునికి ఉంచిన ఆశీర్వాదమును పొందుకున్నాడు. ఈ విధంగా, **ఇదిగో ఇప్పుడు వచ్చి నాకు రావలసిన దీవెనను తీసికొనెనని** ఏశావు చెప్పిన మాటలో సత్యము ఉంది. హృదయమును చించే ఆర్తధ్వనిని ఆయన తన తండ్రికి వినిపిస్తూ **నాకొరకు మరి యే దీవెనయు మిగిల్చి యుండలేదా** అని అడిగాడు. ఇస్సాకు ఇంకను ఏశావును ప్రేమించాడనియు మరియు అలాగైతే ఒకవిధమైన ఆశీర్వాదమును ఆయనకు ఇస్తాడని అనుటకు మాటపూర్వక నిశ్చయత కొరకు ఏశావు బ్రతిమాలాడు.

**వచనము 37. ఏశావు**కు ఇస్సాకు ఇచ్చిన సమాధానం ఆయనకు చాలా తక్కువ నిరీక్షణనే ఇచ్చింది. నిజానికి తన చిన్న కుమారుని పట్ల ఆయన పలికిన ఆశీర్వచన సారాంశమునే (27:27–29) మరలా ఉద్ఘాటించాడు. ఆ బంధుజనులందరి యొక్క నాయకత్వాన్ని యాకోబుకు ఇచ్చాడు, ఇప్పుడు ఆయన **ఏశావు**నకు యజమానుడు. నిజానికి, ఏశావు యొక్క **బంధుజనులందరూ** యాకోబుకు **దాసులుగా** ఉన్నారు, మరియు **ధాన్యమును ద్రాక్షారసమును** సమృద్ధిగా యాకోబు దేవుని నుండి పొందుకొననైయున్నాడు. కాబట్టి, తనజ్యేష్ఠ **కుమారునికి** ఇవ్వడానికి వయసైన తండ్రినొద్ద **ఏముందని** ఏశావును అడిగాడు. ఇస్సాకు యాకోబుకిచ్చిన ఆశీర్వాదము సంపూర్ణం మరియు సమగ్రం, మరియు

ఏశావుకు ఇవ్వడానికి ఆయన దగ్గర ఏమియు లేదు.

**వచనము 38.** ఏశావు సమాధానము ఇస్సాకుకు ఆయన చేసుకున్న దయనీయమైన విన్నపము. తన తండ్రి దగ్గర **ఒకటి** కంటే ఎక్కువ **ఆశీర్వాదము** ఖచ్చితంగా ఉండే ఉంటాయని ఆయన భావించాడు. ఆయన **నా తండ్రీ, నన్ను, నన్నుకూడా దీవించుమని తన తండ్రితో** చెప్పి బ్రతిమాలుకున్నాడు. దీనితో తన ఆఖరు విన్నపము ముగిసింది; ఆయన నిరాశతో **పరుగెత్తి ఏడ్చాడు.**

**వచనములు 39, 40. ఇస్సాకు** ఏశావుపై ఉంచిన ఆశీర్వాదము నిజానికి వ్యతిరేక-ఆశీర్వాదం, లేదా శాపం; ఎందుకంటే ఆయన యాకోబుపై పలికిన దానికి ఇది పూర్తీ విరుద్ధం. "విస్తారమైన ధాన్యము మరియు ద్రాక్షరసముతో" కలిపి "ఆకాశపు మంచు"ను మరియు "భూమి యొక్క సారము"ను పొందుకొనుటకు బదులుగా (27:28), ఆయన **నివాసము** ఎదోములో (25:30; 36:8, 43) ఉంటుంది, మరియు అది **భూసారము లేకయు పైనుండిపడు ఆకాశపు మంచు లేకయు** ఉంటుంది. తన **కత్తిచేత** ఆయన ఆదరించని పర్వతములపైననూ మరియు అరణ్యములోను **బ్రదుకుతాడు.** ఆయన దోచుకునేవానిలా—దాడి చేస్తూ, యుద్ధం చేస్తూ, తమను తాము కాపాడుకోలేనివారిని దోచుకుంటూ—బ్రదుకుతాడు. ఇది ఇష్మాయేలును గూర్చి ఇచ్చిన వివరణలా ఉంది, ఆయన కూడా "అడవి గాడిద" వంటి వాడును మరియు "... అందరి చెయ్యి అతనికిని విరోధముగా ఉండును" (16:12) అని ఆయన గూర్చి చెప్పబడింది. కవలలు పుట్టక మునుపు రిబ్కాకు ఇవ్వబడిన వాగ్దానమును అనుసరించి, తనతమ్ముని ద్వారా వచ్చే సంతానము వారు బలవంతులుగా ఉంటారు; ఏశావు యొక్క సంతానము వారు వారిని **సేవిస్తారు** (25:23, 2సమూ. 8:14). అయినప్పటికీ, ఏశావు సంతానము (ఎదోమీయుల)పై యాకోబు సంతానము (ఇశ్రాయేలీయులు) యొక్క పెత్తనము శాశ్వత కాలము ఉండదు: **నీవు తిరుగులాడుచుండగా నీ మెడమీదనుండి అతనికాడి విరిచివేయుదువు** అని చెప్పబడింది. చాలా శతాబ్దముల తరువాత, రాజైన యోరాముపై[6] తిరుగుబాటు చేయుట ద్వారా యూదా నుండి వారు స్వాతంత్ర్యమును పొందుతారు (2 రాజులు 8:20–22).

## యాకోబును చంపుటకై ఏశావు రచించిన ప్రణాళికలు (27:41–45)

**[41]తన తండ్రి యాకోబుకిచ్చిన దీవెన నిమిత్తము ఏశావు అతనిమీద పగపట్టెను. మరియు ఏశావు – నా తండ్రిని గూర్చిన దుఃఖదినములు సమీపముగా నున్నవి; అప్పుడు నా తమ్ముడైన యాకోబును చంపెదననుకొనెను. [42]రిబ్కా తన పెద్దకుమారుడైన ఏశావు మాటలనుగూర్చి వినినప్పుడు ఆమె తన చిన్నకుమారుడైన యాకోబును పిలువనంపి అతనితో ఇట్లనెను – ఇదిగో నీ అన్నయైన ఏశావు నిన్ను చంపెదనని చెప్పి నిన్నుగూర్చి తన్నుతాను**

**ఓదార్చుకొనుచున్నాడు. [43]కాబట్టి నా కుమారుడుడా, నీవు నా మాటవిని లేచి హారానులోనున్న నా సహోదరుడగు లాబానునొద్దకు పారిపోయి నీ అన్నకోపము చల్లారు వరకు. [44–45]అన్న కోపము నీమీదనుండి తొలగి నీవు అతనికి చేసిన వాటిని అతడుమరచువరకు లాబానునొద్ద కొన్నాళ్లు ఉండుము; అప్పుడు నేను అక్కడనుండి నిన్ను పిలిపించెదను. ఒక్కనాడే మీ యిద్దరిని నేను పోగొట్టుకొననేల అనెను.**

**వచనము 41.** తన పెద్దకుమారుని కొరకు తలచిన **మరణపడక** ఆశీర్వాదమును తనకు ఇచ్చులాగున **యాకోబు తన తండ్రిని** మోసగించాడు గనుక, **ఏశావు** తన తమ్మునిమీద **పగపట్టి** ఆయనను **చంపుటకు** పథకం వేశాడు (4:5, 8, 23 చూడండి). "పగపట్టెను" అని అనువదించబడిన పదము שָׂטַם (*śatam*), "శతృత్వమును ఒకరికి విరోధంగా వహించు"[7] అని దీని అర్థం. చాలా కాలము మట్టుకు ఉండే సుదీర్ఘ ద్వేషాన్ని ఇది సూచిస్తుంది. తన **తండ్రి** మరణించి మరియు **దుఃఖదినములు** సంపూర్ణమైన తరువాత యాకోబును చంపాలనే నిర్ణయాన్ని ఏశావు హృదయమందు పోషించాడు.

**వచనము 42.** నరహత్య విషయమైన తన ప్రణాళికను తనలో దాచుకొనుటకు బదులు దానిని తన స్నేహితులతో చెప్పి ఉంటాడు, ఎందుకంటే **రిబ్కా తన పెద్దకుమారుడైన ఏశావు మాటలను గూర్చి వినినప్పుడు** అని చదువుతాం. ఆమె ... **యాకోబును పిలువనంపి** తనను **చంపుటకు** మంచి సమయము కొరకు కనిపెడుతూ ఏశావు ఇట్టి పగ ఆలోచనలతో **తన్నుతాను ఓదార్చుకొనుచున్నాడు** అని ఆయనకు హెచ్చరిక చేసింది. ఇస్సాకు మరణము వరకు వేచి ఉండి తరువాత తన హత్యా పన్నాగమును నిర్వహించాలనుకుంటున్న ఏశావు ఆలోచనను యాకోబుకు బహుశా ఆమె చెప్పి ఉండదు.

**వచనము 43.** మునుపు గ్రహించినట్లుగా, ఇస్సాకుతో పోలిస్తే రిబ్కాకు వ్యత్యాసమైన స్వాభావం ఉంది; సంకోచించడం లేదా నిష్క్రియాత్మక విధానంలో వెళ్లడం ఆమెకు తెలీదు. దీనికి విరుద్ధంగా, క్రియలు చేయు బలమైన వ్యక్తి ఆమె. ఏదైనా సమస్య లేదా అవకాశము ఆమెకు ఎదురు వచ్చినప్పుడు, వెంటనే ఆమె ఒక ప్రణాళిక రచించి దానిని నేరవేర్చేది (24:15–28, 58–61; 27:5–17). ఈ సందర్భంలో, ఆజ్ఞాపించు మాతృస్వామ్యమైన తన గొప్ప స్వరమును కూడబెట్టుకొని, **నీవు నా మాటవిని లేచి హారానులోనున్న నా సహోదరుడగు లాబానునొద్దకు పారిపో** అని యాకోబుతో అంటుంది. రిబ్కా తాను పెరిగిన చోటనున్న తన బంధువుల వద్దకు ఆయనను పంపుతుంది (11:29, 31; 24:24, 29; 28:2, 5).

**వచనములు 44, 45. అన్న కోపము నీమీదనుండి తొలగి ... వరకు కొన్నాళ్లు ఉండుము** అని రిబ్కా యాకోబుకు చెప్పినప్పుడు ఆమె తన కుమారుని పట్ల

కపటముగానైనా ఉంది లేదా ఇంటికి దూరంగా ఆయన ఎంతకాలం ఉండవలసి వస్తుందో అనే విషయంపై తక్కువ మదింపు చేస్తుంది. యాకోబు జీవితమును గూర్చి ఆమె చాలా భయపడింది, కాబట్టి ఏశావు **కోపము**చల్లారి తనకు చేయబడిన ఆ విరోధకార్యము మరచిపోవు వరకు లాబాను వద్ద ఉండమని ఆయనను హెచ్చరించింది. యాకోబు పట్ల ఏశావు ప్రవర్తన మారిన తరువాత యాకోబును ఇంటికి తెచ్చులాగున ఆయనను **పిలిపించెదను** అని చెప్పింది.

తన వ్యాఖ్యలను బలపరచుటకు, ఆమె **ఒక్కనాడే** తన **ఇద్దరి** కుమారులను పోగొట్టుకొననేల అని పేర్కొంది. ఒకవేళ ఏశావు తన తమ్ముని చంపితే ఆయన కూడా మరణ దండన పొందుతాడు అని ఆమెకు తెలుసునని ఈ వాక్యము మనకు తెలుపుతుంది (9:5, 6 చూడండి). వాస్తవానికి, ఒకే దినమున తన ఇద్దరి కుమారులను ఆమె కోల్పోగలదు. ఈ "కొన్నాళ్లు" అనేవి హారానులో కష్టము మరియు కఠినమైన శ్రమతో నిండిన ఇరువది సంవత్సరాలు అవుతాయని (31:41) యాకోబు కాని తన తల్లి కాని గ్రహించలేదు. తనకు ఇష్టమైన కుమారుని పిలిపించుటకు చేసిన ప్రణాళిక ఎన్నటికి కార్యరూపం దాల్చలేదు. మనకు తెలిసినంత వరకు, వారిద్దరూ ఒకరినొకరు చూసుకోవడం ఇదే ఆఖరు సారి.

## రిబ్కా యొక్క ఫిర్యాదు (27:46)

**46మరియు రిబ్కా ఇస్సాకుతో – హేతు కుమార్తెలవలన నా ప్రాణము విసికినది. ఈ దేశస్థురాండ్రయిన హేతు కుమార్తెలలో వీరివంటి ఒకదానిని యాకోబు పెండ్లిచేసికొనినయెడల నా బ్రదుకువలన నాకేమి ప్రయోజనమనెను.**

**వచనము 46.** యాకోబు హారానుకు ప్రయాణించుటకు ఒక గౌరవార్థమైన మార్గమును సుగమం చేయుటకు మరియొకసారి **రిబ్కా** చొరవ తీసుకుంది. తన సహోదరునికి వ్యతిరేకంగా ఏశావు రచించిన హానిని గూర్చి ఆమె ప్రస్తావన చేయలేదు. తన తండ్రిని మోసగించుటలో యాకోబునకు సహకరించి **ఇస్సాకు**తో తనకు గల సంబంధమును బహుశా భ్రష్టుపట్టునట్లు చేసిన ఆ గాయాలను మరలా రేపుటకు ఆమె నివారించింది. దీనికి బదులు, ఏశావు చేసుకున్న హిత్తీయులైన భార్యలకు **హేతు కుమార్తెల**పై తన కష్టాలను నెట్టింది (26:34; 23:10 చూడండి). కనానీయులైన వారిలో **వీరివంటి ఒకదానిని యాకోబు పెండ్లిచేసికొనినయెడల నా బ్రదుకువలన నాకేమి ప్రయోజనము** అని ఆమె అంది. తన కుమారుడు స్థానిక స్త్రీలలో ఒకదానిని వివాహమాడుటకు తన తండ్రియైన అబ్రాహాము ఎందుకు వ్యతిరేకించాడో జ్ఞాపకము చేయుటకు ఇది ఇస్సాకునకు ఒక జ్ఞాపికగా ఉపయోగపడింది. ఆ కారణము చేతనే, తన సొంత కుటుంబము నుండి కన్యకను కనుగొనుటకు అబ్రాహాము తన సేవకుని హారానుకు పంపించాడు (24:1–67). దూరంలో ఉన్న తన బంధువుల నొద్ద నుండి తనకు భార్యను తెచ్చుకొనునట్లు

యాకోబును కూడా అక్కడకు పంపమని రిబ్కా ప్రతిపాదిస్తుంది (అక్కడైతే అతడు హత్యాప్రయత్నంలో ఉన్న తన సహోదరుని నుండి తప్పించుకొనగలుగుతాడు).

## అన్వయము

### మోసమనే ఒక నాటకము/డ్రామా (అధ్యాయము 27)

*1వ సన్నివేశం. తమ సొంత మార్గములను అనుసరించుటకు దేవుని ప్రజలు దేవుని చిత్తమును ప్రక్కనపెట్టినప్పుడల్లా సమస్యలు సృష్టించారు.* ఈ విషాదంలో మొదటి సన్నివేశమునకు కలవరం, చెడు ప్రవర్తనలు, మరియు 27 అధ్యాయం మిగతా భాగాన్ని నిండిన వినాశనాత్మక క్రియలు వేదికను ఏర్పరుస్తున్నాయి. ఇస్సాకు వృద్ధ వయసులో, తన పెద్ద కుమారుడైన ఏశావుకు తన మరణపడకపు ఆశీర్వాదాలను ఇవ్వాలని అనుకున్నాడు (27:1–4). కష్టతరమైన తన గర్భధారణ కాలంలోదేవుడురిబ్కాతో చేసిన దైవికమైన ప్రవచనము– ... పెద్దవాడు చిన్నవానికి దాసుడగును (25:23)– ఉన్నను ఇస్సాకు ఇది చేయుటకు పూనుకున్నాడు.

ఇస్సాకు గ్రుడ్డివానిగా ఉన్నాడు; రిబ్కాచే రచించబడి యాకోబుచే అమలుపరచబడిన మోసపూరితమైన పథకము విజయవంతం అగుటకు తన గ్రుడ్డితనము సహకరించింది. తన మరణ సమయము సమీపించింది అని ఇస్సాకు అనుకున్నాడు గనుక, తన ఇంటిని చక్కబెట్టుకొనుటకు ఒక మంచి నిర్ణయము చేసాడు. అయినను, తన మరణపడక ఆశీర్వాదాన్ని తన పెద్ద కుమారునికి ఇవ్వాలని అనుకోవడం మంచిది కాదు. ఏశావు ఆత్మసంబంధమైన విషయములను గూర్చి ఆలోచించే మనిషి కాదు. నిజానికి, ఆయన లోకానుసారుడైన వ్యక్తి; తన శరీరాశను, నేత్రాశను మరియు జీవపు డంబాన్ని తృప్తిపరచుకొనుటకు (1 యోహాను 2:16 చూడండి) ఆయన ప్రాథమికంగా జీవించాడు. హెబ్రీ పత్రిక రచయిత ఆయనను "భ్రష్టుడు"[8] మరియు "వ్యభిచారి" అని పిలిచాడు (12:16). దేవుని నిబంధన ప్రజలు అనుసరించుటకు ఒక మంచి మాదిరిని ఉంచుటకు అనువైన నాయకుని వంటి వ్యక్తి ఆయన కాదు. దీనికి అర్థం యాకోబు తన ప్రారంభ కాలంలో నిందారహితుడు అని చెప్పడం కాదు; ఆయన ఖచ్చితంగా కాదు, కాని ఆత్మీయమైన నాయకత్వానికి ఆయనకు సామర్థ్యత ఉంది. యాకోబును గూర్చిన ఈ విషయం దేవునికి తెలుసు, మరియు ఇస్సాకు కూడా దానిని గ్రహించే ఉంటాడు.

తన తండ్రి ఏమి కాడో ఏశావు అదంతా అయి ఉన్నాడు: బయట బాగా తిరిగేవాడు మరియు ఇస్సాకు తినుటకు ఇష్టపడే అడవి జంతువును వేటాడి చంపి దానిని వండుటకు ప్రతిభ గల వేటగాడు కూడాను (25:27, 28). ఏశావు సిద్ధ పరిచే ఆ వంటకముపై ఆయనకున్న ప్రేమ తన చిత్తమును స్వాధీనపరచుటకు ఇస్సాకు అనుమతించాడు. ఇస్సాకు కోరుకుంది తను ప్రేమించిన కుమారుని నుండి చేతి

వంటకము మాత్రమేగనుక, బయటకు వెళ్లి వేటాడి ఆయనను ఆశీర్వదించుటకు మునుపు దానిని తిని ఆనందించుటకు రుచిగల భోజ్యములను సిద్ధపరచి తెమ్మని చెప్పుటకు ఏశావును ఇస్సాకు పిలిచాడు.

*పాఠము:* మన జ్ఞానేంద్రియముల జ్ఞానమైన రుచి (27:4, 9, 25), స్పర్శ (27:21), వినికిడి (27:22), లేదా వాసన (27:27) అనువాటిపై ఆధారపడకుండా ఉండుటకు ఇస్సాకు యొక్క అనుభవము ప్రతి తరములోని దేవుని ప్రజలకు ఒక హెచ్చరికగా ఉంది. మనకు మంచిగా అనిపించే ప్రతిది మనకు మంచిది కాకపోవచ్చు; అది మన జీవితములపట్ల దేవుని చిత్తము అవ్వాలని లేదు. Ernest Hemingway వ్రాసిన *Death in the Afternoon* అనే నవలలో "నైతికము ఏదంటే నీవు మంచిదని భావించేది మరియు అనైతికము ఏదంటే నీవు చెడ్డదని భావించేది"[9] అని ఆయన చెప్పినప్పుడు ఆ పాత్ర ఈ రచయితా యొక్క సొంత నమ్మకాన్నే బయటపెడుతున్నట్లు ఉంది. చాల మంది ప్రజలు ఈ రోజుల్లో తమ జీవితాలలో ఈ తత్వాన్నే అనుసరిస్తారు, మరియు కేవలం వారి మనోభావములపైనే ఆధారపడి చాలా కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు. 1970వ దాశమాంకం ఆఖరు భాగంలోని, "చాలా సరియైనదిగా అనిపించేటప్పుడు అది తప్పు కాజాలదు"[10] అని ఒక పాట అంటుంది. చాలా కాలం క్రితం ఇస్సాకు మోసపోయినట్లుగానే ఇప్పుడు కూడా వ్యక్తులు ఈ విధమైన ఆలోచన ద్వారా మోసపోతున్నారు.

*సన్నివేశం 2. ప్రపంచమును ఆశీర్వాదించాలనే దేవుని కోరిక ఖచ్చితంగా నెరవేర్చబడాలి అని చేసే ప్రయత్నంలోనైనా దేవుని ప్రజలు మోసపూరితమైన మరియు తారుమారు క్రియలను చేయకూడదు.* ఒక భార్య మరియు భర్త ఒకరితోనొకరు యదార్థంగా ఎంతమాత్రము మాట్లాడుకోలేనప్పుడు ఒక విషాదకరమైన పరిస్థితి కొన్నిసార్లు వస్తుంది. ఇస్సాకు మరియు రిబ్కాల మధ్యగల సంబంధం విషయంలో ఇదే జరిగినట్లుగా కనబడుతుంది, ప్రత్యేకంగా వారి ఆఖరి సంవత్సరములలో. పితరుల ప్రపంచంలో పురుషుని మాట నిలిచి ఉంటుంది మరియు మార్చలేనిది. ఈ సంఘటనలో, తన మరణపడక ఆశీర్వాదమును గూర్చి ఏశావుతో పలికిన మాటలను రిబ్కా విన్నప్పుడు, ఆమె విభ్రాంతి నొందింది. ఈ విషయమును గూర్చి తన భర్తతో వాదించుట అనేది ఉపయోగంలేనిపని అని ఆమె తలంచినది, ఎందుకంటే జ్యేష్ఠుడైన మరియు తనకు ఇష్టుడైన కుమారుని ఆశీర్వదించుటకు ఆయన అప్పటికే నిశ్చయించుకున్నాడు గనుక. దీనికి తోడు, యాకోబు తనకు ఇష్టుడైన కుమారుడు గనుక ఆయనకు ఆశీర్వాదమును రాబట్టుటకు ప్రయత్నిస్తున్నావని తనను నిందిస్తాడేమోనని రిబ్కా భయపడింది. తన భర్తను మోసగించుటకు ఈమె చేసిన కపటోపాయముగా ఇది కనబడుతుంది కాని, ఏశావు యాకోబును సేవిస్తాడని దేవుడు చాలా సంవత్సరాల క్రితమే చెప్పాడు (25:23). రిబ్కా ఆలోచనలో శ్రేష్ఠమైన వాటిని గూర్చి మనం ఆలోచిస్తే, ఇస్సాకు యాకోబును ఆశీర్వదిస్తున్నాడు అని ఖచ్చితముగా చూచుటకు రిబ్కా రచించిన

పథకములో మూల కారణం ఈ రెండవది అయి ఉంటుంది.

రిబ్కా యొక్క ఆలోచనలు ఏమైయున్నప్పటికీ, ఆమె క్రియలను క్షమించకుండుటకు మనము చాలా జాగ్రత్తగా ఉండాలి. మోసపూరితమైన మరియు తారుమారు ఆలోచనలను, ఒకవేళ వాటికి సదుద్దేశ్యమే ఉన్నప్పటికీ, దేవుడు ఆమోదించడు (రోమా. 3:8). రిబ్కా తన క్రియలకు హేతువాదం చేసినప్పటికీ, అవి తప్పులు మరియు కుటుంబమంతటికి వినాశనాత్మకమైనవి. పర్యావసానాలను పెడచెవినిపెట్టి తన పథకమును జరిగించుటకు యాకోబును ఆమె వాడుకుంది. మొదటిగా, ఇస్సాకు తన పెద్దకుమారుడు వేటాడి తెచ్చిన జంతువు యొక్క మాంసమును తింటున్నానని అనుకొనునట్లు రెండు మేకపిల్లలను వధించి వండి వాటిని రుచిగా చేయుటకు యాకోబును వాడుకుంది. తరువాత తన చిన్న కుమారుని ఏశావు వస్త్రములతో కప్పింది మరియు గ్రుడ్డివాడైన తన భర్తను మోసగించుటకు తన చేతులను మరియు మెడను మేకచర్మముతో చుట్టింది. ఆమె యొక్క ప్రణాళిక పైనుండి వచ్చే జ్ఞానమును (యాకోబు 3:13–18) వాడక లోకానుసారమైన జ్ఞానమును వాడింది. రిబ్కా యొక్క మోసపూరితమైన పథకము Sir Walter Scott రచించిన ప్రసిద్ధమైన నానుడిని జ్ఞాపకమునకు తెస్తుంది: "మనం మోసగించుటకు మొదట ప్రారంభించినప్పుడు ఎంతటిచిక్కైన గూడును అల్లుతున్నాము!."[11]

*పాఠము:* దేవుడు ఘనమైన తన ఉద్దేశమును నెరవేర్చుటకు మంచిని మరియు చెడును కూడా వాడుకోగలడు (రోమా. 8:28), అలాగని దేవుడు తన గమనములను అందుకొనుటకు పాపాత్మకమైనదానిని లేదా బాధాకరమైనదానిని ప్రయోగించడం క్షమించరానిది. నిజమైన విశ్వాసమంటే పథకము వేయకుండా మరియు మోసగించకుండా జీవించడం. మనము ఎలా అనుకుంటున్నామో లేదా ఏమి జరుగుతదని మనం అనుకుంటామో అనే దానితో కాకుండా దేవుని పట్ల విధేయతను ఇది కోరుతుంది. దేవుడు తన ప్రణాళికలను నెరవేర్చుటకుగాను దేవునిపై ఆధారపడలేదు; మోసపూరితమైన పద్ధతులను ప్రయోగించి ఆయనకు సహాయపడాలని ఆమె అనుకుంది.

విశ్వాసి జీవితంలో మోసమునకు తావు లేదు. ప్రపంచమంతటిని మోసగించువాడు సాతాను (ప్రకటన 12:9), మరియు ఆది నుండే వాడు అబద్ధమాడుచూ ప్రజలను మోసగిస్తూన్నాడు (3:1–13). యేసు సత్యమైయున్నాడు (యోహాను 14:6; 8:32, 36 చూడండి), మరియు ఆయనలో అబద్ధములేదు. ." . . ఆత్మలో కపటము లేనివాడు ధన్యుడు" (కీర్తన. 32:2).

*సన్నివేశం 3. మోసపూరితమైన ప్రయత్నములతో దేవుని ప్రజలు విజయమును పొందినట్లుగా ఉంటారు, కాని తరచూ వారి క్రియలను బట్టి అధికమైన వెల చెల్లిస్తుంటారు.* తరువాతి సంఘటనలో, ఏశావుకు ఇస్సాకు తన మరణపడక ఆశీర్వాదమును ఇవ్వకుండా నివారించుటకు రిబ్కా ఇచ్చిన ఆజ్ఞకు యాకోబు

అంగీకరించాడు. వయస్సైన మరియు గ్రుడ్డివానిగా ఉన్న తన తండ్రిని మోసగించడం తప్పు అని ఆయనకు తెలుసు, కాని నైతికమైన సూక్ష్మబుద్ధి ఉన్నప్పటికీ దానిని చేయుటకు ఆయన నిరాకరించలేదు. ఆయనకున్న ఒకే బాధ ఏమంటే ఇస్సాకు తన పథకమును గుర్తించి ఆయనను ఆశీర్వదించుటకు బదులు శపిస్తాడేమోనని మాత్రమే (27:12).

ఒక గిన్నెడు చిక్కుడుకాయల వంటకమునకు తన సహోదరుని యొక్క జ్యేష్ఠత్వపు హక్కును ఇచ్చివేయమని చెప్పి ఏశావు యొక్క ఆకలిని ఆసరాగా తీసుకున్న (25:29–34) కథలోని యాకోబు ఆశయమును గూర్చి మునుపు కొంత సంగ్రహావలోకనం మనకు ఇవ్వబడింది. ఇస్సాకు ఏశావుకు ఇవ్వదలచిన ఆశీర్వాదమును తనకిచ్చుటకు తన తండ్రిని మోసగించమని తన తల్లి ఆయనను ప్రోత్సహించినప్పుడు యాకోబు యొక్క ఆశయము మరలా ప్రకాశించింది. జీవితంలో ఆశయం చాలా మంచిది; బాగా కష్టపడి యథార్థంగా విజయమును పొందేవాడు కుటుంబమునకు మరియు సమాజమునకు ఆశీర్వాదముగా ఉంటాడు. కాని, అత్యధిక ఆశయములు కలిగిన వ్యక్తికి ఉండే శోధనలు కపట విధానాలను ప్రయోగించి విజయమునకు సత్వరమార్గాలను అన్వేషించునట్లు చేయడం. అదే యాకోబు యొక్క సమస్య.

యాకోబు తన తల్లి ప్రణాళికలో పాలుపొందుటకు అంగీకరించినప్పుడు మోసమనే "చిక్కైన గూడు" ప్రారంభమైంది. ఏశావు వస్త్రములను ధరించి, రిబ్కా సిద్ధపరచిన రుచిగల భోజ్యములను చేతపట్టి ఇస్సాకు గదికి యాకోబు ప్రవేశించినప్పుడు, ఒక అబద్ధం ఇంకొక అబద్ధమునకు దారితీసింది. మోసము మరిఎక్కువ మోసమును ఆహ్వానించింది, యాకోబు ఇంకెక్కువ ద్రోహానికి ఒడిగట్టాడు. మొదటిగా, తానే ఏశావునని చెప్తూ తన పేరును గూర్చి అబద్ధం చెప్పాడు. ఇది ఆయనను ఇస్సాకు జ్యేష్ఠకుమారునని అబద్ధం చెప్పుటకు దారితీసింది. తరువాత ఆయన ఆ మేక మాంసము ఆయన "వేటాడినదే" అని చెప్పి, దేవుడు దానిని అంత శీఘ్రముగా తెచ్చుటకు సహాయము చేశాడని చెప్పి దేవుని నామమును దూషణ చేయునట్లు చేసింది. యాకోబు యొక్క స్వరము ఇస్సాకును కలవరపరచినప్పుడు, తనచేతులపై ధరించిన మేకచర్మము యొక్క రోమాలను తాకుటకు మరియు అవి నిజముగా తన జ్యేష్ఠ కుమారుని చేతులే అని ఇస్సాకు భావించునట్లు చేయుటకు తన తండ్రిని మరలా మాయ చేసాడు. ఆఖరుగా, రుచిగల భోజ్యములను భుజించిన తరువాత తన కుమారుని దగ్గరకు వచ్చి ముద్దుపెట్టుకోమని ఇస్సాకు అడిగాడు; యాకోబు అలా చేసినప్పుడు, ఇస్సాకు తన వస్త్రములను వాసన చూసి, నిజంగానే ఆయన ఏశావు అనే అబద్ధమును అంగీకరించి, తన మరణపడక ఆశీర్వాదమును ఆయనకు ఇచ్చాడు.

*పాఠము:* యాకోబు తన మోసమును ప్రారంభించినప్పుడు, తన కార్యము ఎటువంటి పర్యావసానములను తెస్తుందో ఆయనకు ఎట్టి ఆలోచన కూడా లేదు. తన

కుటుంబము ఫలితంగా అనుభవించే హృదయవేదన, ఎడబాటు మరియు ఒంటరితనమును బహుశా ఆయన ఆలోచించి ఉండడు. తన యొక్క మరణము ఏశావు చేతిలోనే వస్తుందనే భయమును ఖచ్చితంగా ఎదురుచూడలేదు. హారానులో ఆయన వాసము "కొన్నాళ్లు" మాత్రమే ఉంటుందని రిబ్కా యాకోబుకు నిశ్చయించింది గనుక (27:44), ఆయన అక్కడ ఇరువది సంవత్సరములు ఉంటాడని మరియు తన తల్లిని మరలా చూడలేడనే విషయమును ఆయన ఆలోచించలేదు. పాపమును ఇంతటి మోసముగా మరియు వంచనగా చేసేది ఇదే: అది సత్వర భోగాన్ని (3:6; 1 యోహాను 2:15–17) (హెబ్రీ 11:25), లేదా సాధకాన్ని (11:4) ఇస్తుంది; కాని అపరాధ భావాన్ని మరుగు చేసి, ఆత్మగౌరవం కోల్పోయేటట్లు చేసి, ఒకవ్యక్తికి, కుటుంబమునకు, మరియు స్నేహితులకు వచ్చే విషాదమునకు దారితీస్తుంది (27:30–40; 2 సమూ. 12:9–14; కీర్తనలు 32:3, 4; 51:1–19; మత్తయి 26:47–50; 27:3–5).

*సనివేశం 4. పాపము వలన విశ్వాసులు తమ జీవితాలలో తెచ్చుకునే ప్రమాదములు మరియు కష్టములు ఉన్నా కూడా దేవుడు వారి జీవితాలను ఆశీర్వాదించుటకు సమర్థుడు.* ఈ కథలో ఉన్న ప్రతి ఒక్క వ్యక్తి పాపాత్ములై ఏదో ఒక విషయంలోనైనా విఫలమైనవారే. ఇస్సాకు యాకోబుకు ఆశీర్వాదములను ఇచ్చేటప్పుడు దేవుని యొక్క దైవకృతమైన హస్తము ఏశావును మరియు యాకోబును వేరుగా ఉండునట్లు చేసి ఉంటుంది. దేవుడు ఈ చిన్నకుమారుని యొక్క ప్రాణమును కాపాడి కుటుంబము విచ్ఛిన్నమవ్వకుండా ఉంచడము మాత్రమే కాక అబ్రాహాము యొక్క వాగ్దానములు ఇంకను మనుగడలోనే ఉండి దేవుని యొక్క విధానములో నేరవేరబోతున్నాయనే ఆశను సజీవంగా ఉంచాయి.

ఆఖరు సన్నివేశంలో ఏశావు ఇస్సాకు గుడారమునొద్దకు వచ్చాడు. వారికి వ్యతిరేకంగా రిబ్కా మరియు యాకోబులు చేసిన కుట్ర మరియు మోసమునకు వారు వేరువేరు విధాలుగా స్పందించారు (27:30–34). ఇస్సాకు తన జ్యేష్ఠకుమారునికి ఇవ్వదలచిన మరణపడక ఆశీర్వాదములను మోసగించి తన చిన్నకుమారుడు తీసుకున్నాడని తెలుసుకున్నప్పుడు ఇస్సాకు "మిక్కుటముగా గడగడ వణకాడు." యెహోవా ముందు ప్రమాణము చేయబడిన ఆశీర్వాదము తిరిగి వెనుకకు తీసుకోబడలేనిదని ఆయనకు తెలుసు (27:33).

ఇస్సాకు యాకోబునకు ఇచ్చిన ఆశీర్వాదమును మార్చి తిరిగి తనమీదికి ఇస్తాడేమోనని ఏశావు ఆశమీద ఆశ పెట్టుకుని "దుఃఖాక్రాంతుడై పెద్ద కేక వేసాడు" (27:34). ఇక్కడ ఏమి సంభవించింది అంటే తన గర్వమునకు ఒక గట్టి దెబ్బ తగిలింది. సంవత్సరముల క్రితము, ఒక గిన్నె చిక్కుడుకాయల వంటకము కోసము తన రెండింతలు స్వాస్థ్యమును తన సహోదరునికి అమ్మివేసాడు; ఇప్పుడు యాకోబు తన సొంతమైన మరియు విశాలమైన కుటుంబముపై ఏశావు చెలాయించవలసిన నాయకత్వపు మరియు అధికారపు స్థితిని తెసేసుకున్నాడు.

ఏశావు తన తండ్రి హృదయములో పరివర్తన కొరకు చూచి శోకయుక్తమైన అరుపులతో బిగ్గరగా ఏడ్చాడు.

మనస్సును హత్తుకునే ఈ సన్నివేశమును గూర్చి హెబ్రీ పత్రిక రచయితా కొంత అంతర్దృష్టిని ఇచ్చాడు: "ఒక పూట కూటి కొరకు తన జ్యేష్ఠత్వమును అమ్మివేసిన" ఏశావు అని చెప్తూ "ఏశావు ఆ తరువాత ఆశీర్వాదము పొందగోరి కన్నీళ్లు విడుచుచు దానికోసరము శ్రద్ధతో వెదకినను, మారుమనస్సుపొంద నవకాశము దొరకక విసర్జింపబడెను" అని అంటాడు (హెబ్రీ. 12:16, 17). కొంతమంది వ్యాఖ్యానకర్తలు అంటారు ఏశావు పశ్చాత్తాప పడుటకు కుదరలేదు ఎందుకంటే ఆయన ఎన్నుకొనబడని వారిలో ఒకడు గనుక ఆయనకు పశ్చాత్తాపము అనునది అసాధ్యము. అయినప్పటికీ, ఈ వ్యాఖ్య సరియైనది అయి ఉండదు. "పశ్చాత్తాపము" అను పదమునకు గ్రీకు భాషలో ప్రయోగించిన ప్రాథమిక పదము (μετάνοια, *metanoia*) యొక్క అర్థము "మనస్సు మారడము" మరియు "నూతనమైన ధార్మిక మరియు నైతిక జీవితమునకు"[12] నడిపించడం అని ఉంది. ఏశావు తన పాపమును బట్టి ఒప్పుకొనబడలేదు గనుక ఆయన దైవికమైన దుఃఖముతో దేవునివైపు తిరుగుట నుండి దూరముగా పైదొలిగాడు. ఇస్సాకును మోసగించుట ద్వారా యాకోబు మాత్రమే పాపము చేసాడు అని అనుకున్నాడు. ఎన్నో విన్నపములను చేయుట మరియు కన్నీటిని విడుచుట ద్వారా ఏశావు తన తండ్రి మనసును మార్చి తన సహోదరునిపై పలికిన మరణపడక ఆశీర్వాదమును ఉపసంహరించుకొనునట్లు ప్రయత్నించాడు.

*పాఠము:* కళ్లు మందగించిన తన భర్తను మోసగించుటకు రిబ్కా వేసిన పన్నాగమును దేవుడు ఆశీర్వదించుటలో అన్యాయస్థుడుగా ఉన్నాడా అని కొందరు ఆశ్చర్య పడుతుంటారు. మోసగాడైన యాకోబు అబద్ధములు మరియు మోసము ద్వారా కుటుంబము మరియు గోత్రముపైన నాయకత్వమనే ఆశీర్వాదమును పొందుకొనుటకు దేవుడు ఎలా అనుమతించగలడు? ఏశావు ఎలా అయోగ్యుడో అలాగే ఈయన కూడా అయోగ్యుడుగానే ఉన్నాడు.

ఈ కథనములోని సంఘటనలలో ఉన్న మోసమును దేవుడు మన్నించుట లేదు, లేదా ఈ వ్యక్తుల యొక్క కార్యములు మరియు వాటి ఫలితములు దేవుని దృష్టిలో అంత్యము మధ్యమమును సర్దిచేస్తుందని కూడా కాదు. దేవునిపై తీర్పును చేసే ముందు, యెహోవాకు ఒక ప్రణాళిక ఉన్నదనియు ఆ ప్రణాళికను ఆయన చరిత్రలో నేరవేరుస్తున్నాడనియు విమర్శకుడు గుర్తుంచుకోవాలి—ఈ ప్రణాళికే ఆఖరుకు యేసు క్రీస్తు రక్షకుడుగా మరియు ప్రభువుగా వచ్చుటకు దారితీసింది. దేవుని ప్రణాళిక జరుగుతుండగా ఆయన అబ్రాహాము, ఇస్సాకు, మరియు యాకోబుల వంటి పాపాత్ములను మరియు అయోగ్యులతో పని చేయాలి, వారిని ఉపయోగించుకోవాలి మరియు ఆశీర్వదించాలి, ఎందుకంటే వీరికంటే మంచివారైన ప్రజలు లేరు. ప్రతి వ్యక్తి—అప్పుడు, ఇప్పుడు కూడా—దేవుడుఈ ప్రపంచంలో

"లెక్కలను అన్నీ సర్దిచేయడు" (అంటే మూల్యమును కోరి లేదా మనకు వ్యతిరేకంగా లేక్కించడు). "పాపమునకు వచ్చు జీతము మరణము" గనుక (రోమా. 6:23) పాపియైన యాకోబు మరణించవలసి ఉంది. అయినను, ఈ పితరుడు పొందవలసిన తీర్పునకు బదులు దేవుడు తన కృపలో జీవించుటకు ఈయనకు అనుమతినిచ్చాడు.

*ముగింపు.* వృద్ధుడైన తన తండ్రికి ఆయన చెప్పిన అబద్ధముల నుండి యాకోబు ఏ పర్యావసానములు లేకుండా తప్పించుకున్నట్లుగా కనిపిస్తుంది. ఈ కథ కొనసాగుతుండగా, బాధాకరమైన అనుభవాల ద్వారా "విశ్వాసఘాతకుల మార్గము కష్టము" (సామెతలు 13:15) అని ఆయన కనుగొనవలసి వచ్చినదని స్పష్టమౌతుంది. తరువాతి కొన్ని అధ్యాయములలో ఇతరులను మోసగించుట వలన కొన్ని ప్రాముఖ్యమైన పాఠములను యాకోబు నేర్చుకొనవలసి వచ్చినదనికథ బయలుపరుస్తుంది. ఈ విశ్వాస ఘాతుకమునకు అంతటి-ఆహ్లాదకరంగా-లేకుండే స్వీకరించు వైపున ఉండుట ద్వారా వీటిని ఆయన అర్థం చేసుకుంటాడు. తన భవిష్యత్తు మామయైన లాబాను యౌవనుడైన తన మేనల్లుడి కంటే కూడా మోసగించుటలో చాలా చాతుర్యము కలవాడని యాకోబు కనుగొంటాడు. "ఈ ఇద్దరు మనుష్యులు ఒకరికొకరు అవసరం" అని ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం!

---

సూచనలు

[1]Bruce K. Waltke, *Genesis: A Commentary* (Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001), 376. [2]ఇక్కడ పునరావృతమవ్వుతున్న పదముల ద్వారా తెలిసేది అడవి జంతువుల మాంసము నుండి తయారైన వంటకములను తినడం ఇస్సాకుకు ఇష్టం అనేది. (27:4, 7, 9, 14, 17, 19, 25, 31). [3]సమయముగడిచిన కొలదీ, యాకోబు యొక్క (ఇశ్రాయేలు) సంతానము పండ్రెండు గోత్రములుగా విస్తరించాయి. మోషే మరియు యెహోషువా వంటి దైవికంగా ఎన్నుకోబడిన దేశ నాయకులు ముగింపు ఆశీర్వాదములను మరియు/లేదా ఆజ్ఞలను వారి మరణముల ముందు గోత్రముల నాయకులకు, పెద్దలు మరియు ప్రజల అధికారులతో కలిపి, ఇచ్చినట్లుగా ఉంది.(ద్వితీయ. 33:1–29; యెహోషువా 23:1–16; 24:1–28). [4]ఆదికాండము 49:3–12 ప్రకారం యాకోబు రూబేను, షిమ్యోను మరియు లేవిని దాటి తన మరణపడక ఆశీర్వాదమును యూదాకు ఇచ్చినట్లుగా ఉంది, అంటే గోత్రము యొక్క నాయకత్వము. ఇదే విధంగా, యాకోబు పెద్దవారిన సహోదరులను దాటి యోసేపునకు–ఎఫ్రాయిము మరియుమనష్షే అను తన ఇద్దరి కుమారుల ద్వారా–జ్యేష్టత్వపు స్వాస్థ్యమును ఇచ్చాడు. యోసేపుయొక్క ఒక గోత్రమునకు బదులు, ఆయన ఇద్దరు కుమారులు రెండు గోత్రములు అయి కనాను దేశములో రెండింతలు భాగాన్ని పొందుకున్నారు (48:20–22; యెహోషువా 16:1–17:18). [5]ఆశీర్వాదము యొక్క ఈ అంశము దావీదు కాలము వరకు కూడా నేరవేర్చబడలేదు (2 సమూ. 8:1–18). [6]2 దిన. 21:8–10లో యోరాము"యెహోరాము"గా కూడా పిలువబడ్డాడు. [7]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1962), 966. [8]πόρνος (*pornos*) అనేగ్రీకు

పదమునకు అర్థము "జారకుడు," అంటే కనాను స్త్రీలతో లైంగిక చేష్టలను చేసి అలాగే తన తల్లికి విసుగును కలిగించిన ఇద్దరు హిత్తీయులైన భార్యలను చేసుకున్నాడు (27:46). [9]Ernest Hemingway, *Death in the Afternoon* (New York: Charles Scribner's Sons, 1932), 13. [10]Joe Brooks, "You Light Up My Life," ©1977; Universal Music Publishing Group (UMPG)చే హక్కులు పొందబడ్డాయి.

[11]Walter Scott *Marmion* 6.17. [12]William F. Arndt and F. Wilbur Gingrich, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 2d ed. (Chicago: University of Chicago Press, 1979), 512.